Follow: @ANNTELUGU

29-07-2026

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 206 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM







టాప్ న్యూస్

## కెమెరా యాంగిల్ కాదు హృదయం యాంగిల్ మార్చండి



ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురక

03

## హైడ్రాను బంగాళాఖాతంలోకి విసిరేస్తాం



- హైడ్రా తొమ్మిదితలల విషసర్పం
- ఢిల్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02

## విజయవాడ, గుంటూరుతో కలిపి అభివృద్ధి



- అమరావతి అంటే 29 గ్రామాలు కాదు
- సీఎం చంద్రబాబు స్పష్టం

03

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యం విషమం

**వెంటిలేటర్‌పై చికిత్స.. స్పందించని నాడీ వ్యవస్థ!**



**హైదరాబాద్, మహా :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (54) ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రి అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు.ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ జి.విజయ్‌కుమార్ మంగళవారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి తొలుత వరంగల్‌లోని రోహిణి ఆసుపత్రిలో చేరారు.

మిగతా 2వ పేజీలో

# హైడ్రాపై.. తగ్గేదెలే



**కబ్జాకోరులే.. హైడ్రా వద్దంటున్నారు**

**హైడ్రా చీఫ్‌గా ఎవరిని నియమించాలనే విచక్షణ మాకుంది**

- కోర్టు తీర్పును పరిశీలించి తదుపరి కార్యాచరణ
- సోమేష్ కుమార్ పై 400కు పైగా ధిక్కరణలున్నాయి
- ఢిల్లీలో కుండబద్దలు కొట్టిన సీఎం రేవంత్
- పార్లమెంట్‌కు వెళ్ళిన సీఎం

ఢిల్లీ, మహా : హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జా కోర్లు హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్



మిగతా 2వ పేజీలో

# ఖాకీలే..కాటేస్తున్నారు!




**నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో.. వెలుగులోకి వస్తున్న కీచక సీఐల వ్యవహారం**

- వయ్యారపు మాటలతో దగ్గరయ్యే ప్రయత్నం
- ఆ తర్వాత లైంగికంగా కలిసి వేధింపులు
- మొన్న మలక్ పేట్ సీఐ నరసింహా సస్పెండ్
- తాజాగా జూబ్లిహిల్స్ సీఐపై మహిళా ఫిర్యాదు
- గర్భవతిని చేసి, ఆ తర్వాత అబార్షన్
- పలు కారణాలతో కోట్లల్లో డబ్బులు వసూలు
- అన్ని ఆధారాలతో, నగర సీపీ, డీజీపీకి కంప్లెయింట్
- విచారణ చేపట్టిన అధికారులు, చర్యలకు నివేధిక సిద్ధం
- మహిళలను వేధించే సిబ్బందిని..వదిలేదంటూ సీపీ సజ్జనార్ వార్నింగ్

**ఠాణాలకు వచ్చే ఒంటరి మహిళలే వారి టార్గెట్**



హైదరాబాద్ క్రైమ్ బ్యూరో

మహిళలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులే, వారిపట్ల వ్యవహరిస్తున్న తీరూ పోలీసు ప్రతిష్ఠను దిగజార్చేలా చేస్తుంది. ఫిర్యాదులపై పోలీసుస్టేషన్లకు వచ్చే మహిళలతో, సీఐలు చేస్తున్న చేష్టలు, వారిని భరించలేకుండా చేస్తున్నాయి. నువ్వంటే ఇష్టం..నిన్ను అరెస్ట్ చేస్తానా..?, నీతో కలిసి ప్రయాణం చేద్దామనుకుంటున్నాను..నువ్వే నాకు అన్ని ఇక అనే వయ్యారపు మాటలతో, ఒంటరి మహిళలను కొందరు ఖాకీ డ్రెస్ వేసుకున్న సీఐలు లోబర్చుకుంటున్నారు. అంతటితో ఆగకుండా గర్భం కూడా దాల్చేందుకు కారణమవుతూ, అబార్షన్ లు చేయిస్తూ, మహిళలను దారుణంగా వేధిస్తున్నారు. ఇలాంటి తరహా సీఐలు, పోలీసుశాఖలో

మిగతా 2వ పేజీలో

## బీఆర్ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం



- రాజకీయాలకోసమే హైడ్రాపై పిటిషన్లు
- మంత్రి శ్రీధర్ బాబు

03



## 2 నెలల్లోనే పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు పూర్తి

02

## బుల్లి తెరకు మహర్ధశ



- టీవీ ఆర్టిస్టుల అవార్డులకు సర్కార్ ఆలోచన
- పీవీ పేరును పరిశీలిస్తున్నామన్న మంత్రి కోమటిరెడ్డి

03



## హైదరాబాద్ ను ముంచెత్తిన వర్షం

హైదరాబాద్ సిటీ, మహా : భాగ్యనగరాన్ని మంగళవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకధాటిగా కురిసిన కుండపోత వానకు రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా కార్యాలయాల పని వేళలు ముగిసే సమయం కావడంతో హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ సహా నగరంలోని పలు ప్రాంతాల్లోపై వర్షం ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పోలీసులు రంగంలోకి దిగి కీలక జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదే సమయంలో హైడ్రా బృందాలు రహదారులపై నిలిచిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేశాయి. కాగా, సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కూడా నగరంలో పలుచోట్ల వర్షం కురిసింది.

## నచ్చలేదా.. వదిలెయ్

ఫ్యాన్స్ మీట్ లో అల్లు అర్జున్ హాట్ కామెంట్స్



03






## శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా!

**అంతా ఆ జూనియర్ అసిస్టెంట్ కనుసన్నల్లోనే..!**

- ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌తో కుమ్మక్కై అక్రమాలకు తెగబడ్డ వైనం..?
- డమ్మీగా మారిన సబ్‌రిజిస్ట్రార్..!
- కోట్లు కొల్లగొట్టిన ఓ జూనియర్ అసిస్టెంట్..?
- ఆ ఒక్క రిజిస్ట్రేషన్‌కే రూ.20 లక్షల డీల్..?
- దండిగా టీఎన్‌జీఓ నాయకుడి అండదండలు..?
- అడ్డూ అదుపూ లేని అక్రమ సంపాదన..?
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలేవి ..!
- ఏసీబీ దృష్టి సారించేనా ..!



శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసలు ఏం జరుగుతోంది..? నెలకు మహా అయితే రూ.40 వేల వరకు జీతం తీసుకునే ఓ జూనియర్ అసిస్టెంట్ అనతి కాలంలోనే కోట్ల రూపాయల ఆస్తులు ఎలా కూడబెట్టాడు..? రోజుకో ఖరీదైన కారులో కార్యాలయానికి రావడం, ప్లాట్లు, విలాసవంతమైన ఇళ్లు, ఎకరాల కొద్దీ వ్యవసాయ భూములు, ఐదు నుంచి ఆరు కార్లతో రాజసంగా జీవితం గడపడం వెనుక మర్మమేంటి..? ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి జీవనశైలి స్థానికులను, రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఉన్నప్పటికీ, వ్యవహారాలన్నీ ఓ జూనియర్ అసిస్టెంట్ కనుసన్నల్లోనే నడుస్తున్నాయని స్థానికంగా బహిరంగ చర్చ జరుగుతుంది. అతడు చెప్పిందే శాసనం, చేసిందే రిజిస్ట్రేషన్ అన్నట్టుగా

మిగతా 2వ పేజీలో



# శంషాబాద్‌లో అక్రమ రిజిస్ట్రేషన్ల దందా!

( మొదటిపేజీ తరువాయి )

పరిస్థితులు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉంటే చాలు, కార్యాలయంలో అతని సామ్రాజ్యం మొదలవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. సరైన పత్రాలు, అర్హత లేని కొన్ని డాక్యుమెంట్లను సైతం బారీ మొత్తంలో ముడుపులు తీసుకుని, కార్యాలయ సమయం ముగిసిన తర్వాత కూడా రాత్రి వరకు అక్కడే ఉండి తనకు అనుకూలమైన వ్యవహారాలను చక్కబెట్టడం, సంబంధిత పనులను పూర్తి చేయించడం పరిపాటిగా మారిందని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి.గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జరిగిన పలు రిజిస్ట్రేషన్లపై ప్రస్తుతం తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్‌తో కుమ్మక్కై వందకు పైగా అక్రమ రిజిస్ట్రేషన్లు నిర్వహించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని, ఈ ఏడాది జనవరి నెలలో జరిగిన ఓ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌తో కుమ్మక్కైన జూనియర్ అసిస్టెంట్ సుమారు రూ.20 లక్షలకు బేరం కుదుర్చుకుని నిబంధనలకు విరుద్ధంగా ఆ రిజిస్ట్రేషన్ నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో జూనియర్ అసిస్టెంట్ కీలక పాత్ర పోషించినట్లు స్థానికులు పేర్కొంటున్నాయి.



ఈ వ్యవహారం వెనుక టీఎన్‌జీఓలోని ఓ ప్రముఖ నాయకుడి అండదండలు ఉన్నాయనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది."తిలా పాపం తలా పిడికెడు" అన్న చందంగా ఈ వ్యవహారంలో ఒక్కొక్కరి పాత్రపై ఒక్కో ఆరోపణ వెలుగులోకి వస్తోంది. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్, డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్లు.. ఇలా ఎవరి పాత్ర ఎంత..? ఎవరి బాధ్యత ఎంత..? అన్నది నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్ వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారడం, వందల సంఖ్యలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆదాయానికి మించిన ఆస్తులపై వ్యక్తమవుతున్న అనుమానాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అవినీతి ఆరోపణలపై ఏసీబీ వరుస దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో, శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ వ్యవహారాలపై కూడా సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ పెరుగుతోంది. ఆదాయానికి మించిన ఆస్తులు, అనుమానాస్పద రిజిస్ట్రేషన్లు, భారీ మొత్తాల లావాదేవీలు, అధికారుల కుమ్మక్కు ఆరోపణలపై ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి సారిస్తే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను బట్టబయలు చేయాలని వారు కోరుతున్నారు.

**ఆ జూనియర్ అసిస్టెంట్ ఎవరు..?**
**అతని వెనుక ఉన్న శక్తులెవరు..?**
**రూ.20 లక్షల డీల్‌గా ప్రచారం**
**జరుగుతున్న ఆ డాక్యుమెంట్ కథేంటి..?**
**ఆ వ్యవహారంలో ఇన్‌చార్జ్ సబ్**
**రిజిస్ట్రార్ పాత్ర ఏమిటి..?**
**అనుమానాస్పద రిజిస్ట్రేషన్ల వెనుక**
**అసలు సూత్రధారులు ఎవరూ..?**
**పూర్తి ఆధారాలు, రిజిస్ట్రేషన్ రికార్డులు,**
**సంబంధిత వర్గాల వాంగ్మూలాలు, కీలక ఆధారాలు,**
**సంచలనాత్మక కథనాలతో...**
**త్వరలో 'మహా పత్రికలో' ఎక్స్‌క్లూజివ్‌గా మీ**
**ముందుకు..!**

# ఖాకీలే..కాటేస్తున్నారు!

( మొదటి పేజీ తరువాయి )

ప్రస్తుతం రోజురోజుకు పెరిగిపోతున్నారు. పైగా ఇలాంటి సీఐలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే, బెదిరింపులకు దిగడం కలకలం రేపుతోంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో యువతితో అసభ్యకరంగా చాటింగ్, ఫోన్ కాల్స్ మాట్లాడి వేధించిన మలక్ పేట్ ఇన్‌స్పెక్టర్ నరసింహాపై సస్పెండ్ వేటు వేయగా, జూబ్లిహిల్స్ సీఐ, తనను లోబర్చుకుని, గర్భవతిని చేసి అబార్షన్ కూడా చేయించాడని ఓ మహిళా, రాష్ట్ర డీజీపీ, సీఎంఓ, సిటీ పోలీసు కమిషనర్ కు ఫిర్యాదు చేయడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ప్రస్తుతం పోలీసుశాఖలో పనిచేసే సిబ్బంది తమను లైంగిక వేధిస్తున్నారంటూ, బాధిత మహిళలు నేరుగా సంబంధిత పోలీసు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారుతోంది. ఫిర్యాదుల్లో అనేక ఆధారాలను చూపడంతో, పోలీసు ఉన్నతాధికారులు సైతం షాక్ కు గురవుతున్నారు. పోలీసు సిబ్బంది మహిళలతో వ్యవహరిస్తున్న తీరు అధికారులను ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. ఒంటరి మహిళలను, యువతులను టార్గెట్‌గా, కొందరు సీఐలు నడిపిస్తున్న తతంగంపై, పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మహిళలకు రక్షణగా ఉండాల్సిన వారే, వారిని లైంగిక వేధింపులకు గురిచేయడాన్ని ఏమాత్రం ఉపేక్షించేదిలేదని హెచ్చరిస్తున్నారు.

**యువతిపై మలక్‌పేట్ సీఐ**
**లైంగిక వేధింపులు..సస్పెండ్**

హోటల్ ఓనర్‌తో జరిగిన వివాదంలో, కేసు నమోదు కాబడిన ఓ యువతితో మలక్ పేట్ ఎస్‌హెచ్ఓ నరసింహా అసభ్యకరంగా మాట్లాటమే కాకుండా, లైంగికంగ వేధింపులకు దిగినట్లు ఏకంగా పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ కు బాధిత మహిళ నేరుగా కలిసి ఫిర్యాదు చేసింది. కొన్ని రోజులుగా బాధితురాలికి సీఐ నర్సింహా ఫోన్ లు చేసి వేధించడమే కాకుండా, తీవ్ర అసభ్యకరంగా మాట్లాడినట్లు కాల్స్ రికార్డింగ్స్ వినిపించింది. ఎక్కడ కలుద్దాం..నీకు తాగడమంటే ఇష్టమా..లేదంటే నా పక్కన కూర్చో అనే మాటలు మాట్లాడటమే కాకుండా, ఆమెపై నమోదైన కేసులో ''నిన్ను అరెస్ట్ చేస్తానా బంగారం'' అనే మాటలతో



తీవ్రంగా వేధించాడని బాధితురాలు సీపీకి వివరించింది. దీంతో ఆగ్రహానికి గురైన సీపీ వెంటనే, ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించి, ఆ నివేధిక ఆధారంగా సీఐ నరసింహాను సీపీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా సీఐ నరసింహాపై అతని భార్య కూడా అదనపు కట్నం కావాలంటూ వేధిస్తున్నట్లు అతనిపై కొంతకాలంగా ఫిర్యాదులు కూడా చేస్తుండటం అతని సస్పెండ్ కు కారణమైనట్లు తెలుస్తోంది. ఇలాంటి తరహా సీఐలు అనేక మంది డిపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు సీపీ విచారణలోఅంతర్గతంగా తెలుస్తోంది.

**ఒంటరి మహిళకు దగ్గరై..**
**మహిళను గర్భవతిని చేసిన సీఐ**

గతంలో తాను పనిచేసిన పోలీసు స్టేషన్ పరిధిలో మహిళను టార్గెట్ గా చేసుకున్న సీఐ, ఆమె ఒంటరితనాన్ని ఆసరగా చేసుకుని, ఆమెకు దగ్గరై, లైంగికంగా కలిసి, గర్భం దాల్చేందుకు కారణమై, బలవంతంగా ఆమెకు అబార్షన్ కూడా చేయించిన సీఐ వ్యవహారం ప్రస్తుతం హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో హాట్ టాపిక్ గా మారింది. బాధితురాలు పేర్కొన్నప్రకారం, ప్రస్తుతం జూబ్లిహిల్స్ సీఐగా పనిచేస్తున్న ఎస్‌హెచ్ఓ యూ. శ్రీనివాసులు రెడ్డి, అతను అమీన్‌పూర్ సీఐగా పనిచేసిన సమయంలో తాను ఓ ఫిర్యాదుపై పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పటి నుంచి తన ఒంటరితనాన్ని ఆసరగా చేసుకుని, ఆమెకు దగ్గరయ్యాడని వివరించింది. అనేక రకాలుగా మాయమాటలు చెప్పి, తనను నమ్మించాడని, దాంతో అతనికి దగ్గరయ్యానని వివరించింది. వీటన్నంటిని అవకాశంగా మల్చుకున్న సీఐ శ్రీనివాసులు రెడ్డి, తనను లైంగికంగా ఇబ్బందిపెట్టడంతో గర్భం కూడా దాల్చానని, ఆ విషయం తెలుసుకుని వెంటనే తనకు అబార్షన్ కూడా చేయించాడని, దీంతో తాను తీవ్ర అనారోగ్యానికి గురయ్యానని వెల్లడించింది. అంతేకాకుండా తన దగ్గర లక్షల్లో డబ్బులు తీసుకుని వేధిస్తున్నాడని, స్పష్టం చేసింది. తనకు జరిగిన అన్యాయంపై ఎన్నిసార్లు పోలీసు స్టేషన్ కు వెళ్లినా సరే, ఏం చేసుకుంటావో చేసుకో అనే ధోరణితో బెదిరించినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అనేక రకాలుగా దాడి చేసి, గాయపర్చాడని పేర్కొంది. వీటన్నంటిపై అన్ని ఆధారాలతో సీపీకి ఫిర్యాదు చేసానని, విచారణ కూడా చేపడుతున్నారని వెల్లడించింది. కాగా తీవ్రమైన ఫిర్యాదుపై స్పందించిన సీపీ సజ్జనార్ వెంటనే విచారణకు ఆదేశించారు. అధికారుల నుంచి నివేధిక రాగానే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

**ఉన్నతాధికారులు కఠినంగా**
**వ్యవహరించాల్సిందే..**

పోలీసులే మహిళలను వేధించడం, వారితో లైంగిక వ్యవహారాలు సాగించడం..పోలీసుశాఖకు మాయని మచ్చగా చెప్పాల్సిందే. ఇలాంటివారితో పోలీసుశాఖ పరువు బజారున పడే అవకాశం ఉంది. ప్రజలకు ఎంతో నమ్మకం కలిగించాల్సిన పోలీసులు, మహిళల పట్ల వ్యవహరిస్తున్న తీరూ ప్రస్తుతం, ప్రభుత్వానికి సైతం చెడ్డపేరు తెచ్చే ప్రమాదం ఉంది. మహిళలతో అక్రమ సంబంధాలు, ప్రేమాయాణాలు సాగించే పోలీసులను గుర్తించి, గతంలో వారిని సర్వీస్ రిమూవల్స్ చేసిన దాఖాలలు అనేకంగా ఉన్నాయి. వీరిపై కఠినంగా వ్యవహరించకపోతే, తమను ఎవరూ ఏమి చేయలేరనే ధీమాతో అనేకమంది మహిళలను వేధించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహిళలను వేధించే వారిని ఉక్కుపాదం మోపే అధికారిగా గుర్తింపు ఉన్న వీసీ సజ్జనార్, ప్రస్తుతం జూబ్లిహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డి సాగించిన వ్యవహారంపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటారనేది ఉత్కంఠంగా మారింది.

# హైడ్రాపై..తగ్గేదెలే

( మొదటి పేజీ తరువాయి )

మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఢిల్లీలోనే ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం పార్లమెంట్ కు వెళ్ళారు.

**ఆఫ్‌లైన్ పరీక్షల వల్లే ఎక్కువ సమస్యలు**

ఆఫ్‌లైన్ పరీక్షల నిర్వహణ వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని అన్నారు. అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్రాల అధికారాలను లాక్కునే యత్నం చేస్తుందంటూ కేంద్రంపై నిప్పులు చెరిగారు. వర్సిటీలపై ఆధిపత్యం చెలాయించాలని కేంద్రం చూస్తోందని విమర్శించారు. విద్య అంశం వీలైనంత వరకు రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని అభిప్రాయపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని వివరించారు. తెలంగాణలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని చెప్పారు. గ్లోబరీనా వంటి సంస్థలు నాడు అక్రమాలు చేశాయని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చర్యలు తీసుకోనందునే



సీబీఎస్ఈకి ఈ అక్రమాలు విస్తరించారని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

**రాష్ట్రానికి 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి: కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. గతంలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని తెలిపారు. అలాగే వీబీజీ రాంజీలో అదనపు పనులు కేటాయించాలని కోరారు. ఇక ఈ వీజీరాంజీ లో 10 కొత్త పనులను చేర్చాలని అడిగారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు.. పట్టు పురుగుల పెంపకం షెడ్లకు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిని సీఎం రేవంత్ అనుమతి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను ఈ వీజీరాంజీ జాబితాలో చేర్చి.. లబ్ధిదారులకు 90 రోజుల పని కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట ఎంపీలు మల్లురవి, చామలకిరణ్ కుమార్ రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 2 నెలల్లోనే పేపర్ లీకేజీ కేసుల దర్యాప్తు పూర్తి

న్యూఢిల్లీ, మహా : కేంద్ర దర్యాప్తు సంస్థ అయినా లేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ అయినా పేపర్ లీకేజీ కేసుల్లో దర్యాప్తును కేవలం 2 నెలల వ్యవధిలో పూర్తి చేయనున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. పేపర్ లీకేజీలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షించేందుకు తీసుకొచ్చిన "పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026" బిల్లు లోక్‌సభలో చర్చను ప్రారంభిస్తూ పేపర్ లీకేజీ ఘటనల్లో కఠిన శిక్ష అమలు చేసేందుకు పేపర్ లీకేజీ నిరోధక బిల్లులో సవరణ చేపట్టినట్లు తెలిపారు. సెక్షన్ 10లోని సబ్ సెక్షన్ 1 ప్రకారం లీకేజీకి పాల్పడిన వ్యక్తికి 5 ఏళ్ల వరకు జైలుశిక్ష ఉండేది. ఆ కేసుల్లో పది లక్షల జరిమానా కూడా ఉంది. అయితే సవరణ ద్వారా జైలుశిక్షను 5 నుంచి పదేళ్లకు మార్చారు. జరిమానాను 50 లక్షలకు పెంచారు. 2024 చట్టం ప్రకారం సర్వీస్ ప్రొవైడర్‌కు కోటి జరిమానా ఇస్తున్నారు. ఆ ఫైన్‌ను ఇప్పుడు 5 కోట్లకు పెంచారు. పరీక్షల నిర్వహణ నుంచి గతంలో 4 ఏళ్ల వరకు తప్పించేవారు. ఇప్పుడు సవరణ ద్వారా ఆ సమయాన్ని 8 ఏళ్లకు పెంచామని వివరించారు. పేపర్ లీకేజీ కేసుల్లో వ్యవస్థీకృత నేరానికి పాల్పడే మాఫియాకు కూడా శిక్షా కాలాన్ని, జరిమానాను పెంచారు. గతంలో 5 నుంచి 10 వరకు ఉన్న జైలుశిక్షను ఇప్పుడు 7 నుంచి 10 ఏళ్ల వరకు పెంచారు. గతంలో ఆర్గనైజ్డ్ క్రైంకు పాల్పడితే కోటి జరిమానా విధించేవారు. ఇప్పుడు దాన్ని రూ. 10 కోట్లకు సవరించినట్లు మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. వేగంగా న్యాయం అందించాలని ప్రధాని మోదీ చేసిన సూచన ప్రకారం.. స్పెషల్ టాస్క్ ఫోర్స్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వీటిల్లో టైం నిబంధన పెట్టారు. ఈ ప్రతిపాదిత బిల్లు చట్టమైతే సత్వర న్యాయం జరుగుతుందన్నారు. పరీక్ష పేపర్ లీకేజీలు అరికట్టేందుకు నందన్ నిలేకని ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంతకు ముందు యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఎంట్రన్స్ పరీక్షలు, ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని జితేంద్ర సింగ్ గుర్తుచేశారు.



2009, 2011లో ఎన్నో పేపర్ లీక్స్, 2010లో యూపీలో బీఈడీ పేపర్ లీక్, 2012లో ఎయిమ్స్ ఎంట్రన్స్ పేపర్ లీక్, తమిళనాడులో పీఎస్సీ పేపర్ లీక్ జరిగాయి. క్రమంగా ఇవి వ్యవస్థీకృత నేరాలుగా మారాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లలో కొన్ని ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి ఎందుకు ఫలించలేదో ఆనాటి పాలకులే చెప్పాలని జితేంద్ర సింగ్ సూచించారు. ప్రస్తుతం ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లు అనేది విద్యార్థులు, యువత పట్ల మోదీ సర్కార్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఇది భారత పార్లమెంట్ చరిత్రలోనే నిలిచిపోతుందని చెప్పారు. "చరిత్రను పరిశీలిస్తే 1992లో మొదటిసారి ఉమ్మడి పరీక్ష కోసం సిఫార్సు చేయడం జరిగింది. 2010లో యూపీఏ పాలనలో ఒక కమిటీ ఏర్పాటు అయ్యింది. కానీ ఆ పని మధ్యలోనే నిలిచిపోయింది. అలా నిలిచిపోయిన పనిని పూర్తి చేసినందుకు మీరు ప్రధాని మోదీని, ఈ ప్రభుత్వాన్ని అభినందించాలి" అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

**ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదన్న ప్రతిపక్షాలు**

ప్రతిపక్షాల చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గోగోయ్, పేపర్ లీక్‌ల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో లేదని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్‌పై 37 రోజుల విద్యార్థుల నిరసన తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం, మరోవైపు 'పాకిస్థాన్‌తో యుద్ధం చేసి తిరిగి వచ్చినట్లుగా' బీజేపీ ఎంపీలు ఆయనకు పార్లమెంటులో స్వాగతం పలకడం మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఆయన ఎత్తి చూపారు. బిల్లును పరిశీలించిన తర్వాత, పరీక్షలలోని అవకతవకలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎలాంటి అర్థవంతమైన మార్పు తీసుకురావడానికి సుముఖంగా లేదనే అభిప్రాయం తనకు కలిగిందన్నారు. ప్రతిపాదిత సవరణను 'కంటి తుడుపు చర్య'గా అభివర్ణిస్తూ, రెండేళ్ల క్రితం అసలు చట్టాన్ని ప్రవేశపెట్టినప్పుడు, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి మరియు పేపర్ లీక్‌లను నివారించడానికి ఉద్దేశించిన ఒక చారిత్రాత్మక చర్యగా ప్రభుత్వం దీనిని అభివర్ణించిందని గోగోయ్ గుర్తు చేశారు. విద్యా రంగం పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాన్ని విమర్శిస్తూ, 2024 చట్టం వచ్చినా కూడా ప్రభుత్వ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవుతూనే ఉన్నాయని ఆయన తెలిపారు. "ఇది ఒక సవరణ బిల్లు. ఒకవేళ ఈ చట్టం 2024లో అమల్లోకి వస్తే, 2025 లేదా ఆ తర్వాత ఇన్ని ప్రశ్నపత్రాలు ఎలా లీక్ అయ్యాయి?" అని ఆయన ప్రశ్నించారు. 45 ప్రశ్నపత్రాలలో 44 లీక్ అయ్యాయని ఒక మీడియా నివేదికను ఉటంకిస్తూ, నీట్ యూజీ ప్రశ్నపత్రాల లీక్ దర్యాప్తు పురోగతిని కూడా ఆ కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు. "'ప్రధాన మంత్రి'ని కాపాడటానికి ప్రభుత్వం 'ప్రధాన్'ను తొలగించింది" అని చెబుతూ, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్‌పై జాతీయ రాజధానిలో జరుగుతున్న విద్యార్థుల నిరసనలపై మాట్లాడుతూ, "ప్రభుత్వం తలవంచుతుంది, కానీ దానిని తలవంచేలా చేయడానికి ఎవరో ఒకరు కావాలి" అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో జరిగిన పేపర్ లీక్‌ల గురించి మాట్లాడుతూ, "చట్టం సమర్థవంతంగా ఉంటే బీజేపీ పదేళ్ల హయాంలో 20 పరీక్షలు ఎలా లీక్ అయ్యాయి..?" అని అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. "దొంగతనాన్ని నివారించడంలో విఫలమైన వారిని ఎలా నమ్మగలం? ఈ కొత్త బిల్లు ఇప్పటికే ఉన్న చట్టానికి కేవలం ఒక సవరణ మాత్రమే. మీరు ఎవరిని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు?" అని కూడా ఆయన మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యం విషమం

( మొదటి పేజీ తరువాయి )

ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడం (పల్మనరీ ఎంబోలిజం) కారణంగా రక్తపోటు తీవ్రంగా పడిపోయి,గుండె స్పందన నిలిచినట్లు వైద్యులు తెలిపారు.దాదాపు 45 నిమిషాల పాటు సీపీఆర్, ఏసీఎల్ఎస్ పద్ధతుల్లో అత్యవసర చికిత్స అందించి గుండె స్పందనను పునరుద్ధరించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తరలించారు. క్రిటికల్ కేర్, పల్మనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాల నిపుణులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. వెంటిలేటర్ స్వల్ప మద్దతుతో శ్వాసక్రియ, రక్తపోటు కొనసాగుతున్నప్పటికీ, సుదీర్ఘంగా గుండె స్పందన నిలిచిపోవడంతో నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.ఈఈజీ, ఎంఆర్ఐ,టీసీడీ పరీక్షల్లో మెదడుకు ఆక్సిజన్ అందక ఏర్పడిన నష్టం గుర్తించినట్లు తెలిపారు.శబ్దం,స్పర్శకు ఆయన స్పందించడం లేదన్నారు. వైద్య ప్రమాణాల ప్రకారం బుధవారం 72 గంటల న్యూరో అసెస్‌మెంట్ నిర్వహించి మెదడు పనితీరును మరోసారి అంచనా వేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నాయి.



# హైడ్రాను బంగాళాఖాతంలోకి విసిరేస్తాం

**న్యూఢిల్లీ, మహా :** హైకోర్టు హైడ్రాపై ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రాను అడ్డుపెట్టుకొని రేవంత్ రెడ్డి దందాలు చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, హైడ్రా పేరుతో పేదల ఇళ్లను అన్యాయంగా కూలగొట్టారని కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ ను కుప్పకూల్చారన్నారు. హైడ్రా అనేది బ్లాక్ మెయిల్ చేసి దోపిడి చేసే సంస్థని బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో బిల్డర్లను భయపెట్టి ఒక్కో బిల్డర్ వద్ద ఫీట్ కు 200 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు.కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైల్వే పనులన్నీ స్తంభించిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా అనే సంస్థ తొమ్మిది తలల విషసర్పంలా మారిందని, కేవలం పేదల ఇళ్లపైనే హైడ్రా చర్యలు తీసుకుంటోందని, అధికార పార్టీ నేతలు, మంత్రులు, వారి కుటుంబాలకు చెందిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని నిషేధిత భూముల విస్తీర్ణం బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే సమయానికి 16 లక్షల ఎకరాలు ఉండగా, కాంగ్రెస్ హయాంలో అది కోటి ఎకరాలకు చేరిందన్నారు. భూ వ్యవహారాల్లో అవినీతి, కమిషన్ల కోసం నిషేధిత భూముల జాబితాను పెంచుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వేలాది ఇళ్లను కూల్చివేసి, ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని దీంతో రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. పెద్ద నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా, సామాన్య ప్రజల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మండలిలో ప్రభుత్వ విప్ పట్నం మహేంద్ర రెడ్డి నివాసాలను ఎందుకు కూల్చలేదని నిలదీశారు. బిల్డర్స్‌ను బెదిరించి డబ్బులు వసూలుల్ చేస్తున్నారని హైడ్రా సంస్థ సీఎం రేవంత్‌కు వేటకుక్కలా మారిందని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# ఈడీ సోదాల కలకలం

**హైదరాబాద్ విస్తృత సోదాలు**
**డ్రగ్స్ కేసులో హైదరాబాద్,**
**బెంగళూరులలో తనిఖీలు**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న నకిలీ కాల్ సెంటర్ మోసాల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మరోసారి భారీ సోదాలు నిర్వహించారు. విదేశీ పౌరులు, ముఖ్యంగా అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని కోట్ల రూపాయల మోసాలకు పాల్పడిన ముఠాపై మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్న ఈడీ.. కీలక నిందితుడు వికాస్ నిమార్ను అదుపులోకి తీసుకుంది. అనంతరం అతడిని వైద్య పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు అమెరికా ప్రభుత్వ విభాగాల అధికారులమని బాధితులను నమ్మించి, పన్ను బకాయిలు, రుణ బకాయిలు, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ప్రమేయం ఉందంటూ భయపెట్టి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఈడీ గుర్తించింది. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించి అమెజాన్ గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేయించడం, డిజిటల్ చెల్లింపులు చేయించడం ద్వారా కోట్ల రూపాయలను అక్రమంగా సేకరించినట్లు విచారణలో తేలింది.

క్రిప్టోకరెన్సీగా అక్రమ సంపాదన

బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని బిట్‌కాయిన్‌తో పాటు ఇతర క్రిప్టోకరెన్సీలుగా మార్చినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. అహ్మదాబాద్‌లో నిర్వహించిన సోదాల్లో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఆకిబ్ గులామ్ రసూల్ ఘాంచి వద్ద సుమారు 12 వేల డాలర్ల విలువైన క్రిప్టోకరెన్సీ, అలాగే రూ.13.5 లక్షల నగదు, కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లోని పలు నకిలీ



కాల్ సెంటర్లపై ఈడీ దాడులు నిర్వహించింది. తాజాగా హైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్‌లోని ఆరు వేర్వేరు ప్రాంతాల్లో కూడా సోదాలు చేపట్టింది. వేర్వేరు ప్రాంతాల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ, అన్ని కేంద్రాల్లో ఒకే తరహా మోసపూరిత విధానాన్ని అనుసరించినట్లు ఈడీ గుర్తించింది.

**మనీలాండరింగ్**

సైబరాబాద్ పోలీసులు, ఢిల్లీ సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. ఈ కేసులో మహమ్మద్ అన్సారి అలియాస్ మహమ్మద్ ఇర్ఫాన్ అన్సారి, ఆకిబ్ గులామ్ రసూల్ ఘాంచి, వికాస్ కె. నిమార్, దివ్యాంగ్ రావల్, ప్రదీప్ వి. రాథోడ్లను నిందితులుగా పేర్కొంది.

**డ్రగ్స్ కేసులోనూ**

ఫేక్ కాల్ సెంటర్ కేసుతో పాటు మరోవైపు బెంగళూరులో డ్రగ్స్ కేసుకు సంబంధించి కూడా ఈడీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. రెండు కేసుల్లోనూ దర్యాప్తు కొనసాగుతుండగా, మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## కెమెరా యాంగిల్ కాదు హృదయం యాంగిల్ మార్చండి

**ఢిల్లీ, మహా :** ప్రభుత్వం యువత నమ్మకాన్ని గెలుచుకోవాలంటే ప్రధాని నరేంద్ర మోదీ మార్చుకోవాల్సింది కెమెరా యాంగిల్ కాదని, తన ఆలోచనా దృక్పథాన్ని మార్చుకోవాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా లోక్‌సభలో వ్యాఖ్యానించారు. మంగళవారం నాడు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, సోషల్ మీడియా వీడియోలు, కొత్త కెమెరా యాంగిల్స్‌తో యువతలో విశ్వాసాన్ని నింపలేరని పేర్కొన్నారు. "ఈ తరం యువతకు అన్నీ తెలుసు, వారికి నిజానిజాలను గుర్తించే విచక్షణ ఉంది. వారి మనసు గెలవాలంటే నిజాయతీ అవసరం" అని ప్రియాంక స్పష్టం చేశారు. ఇటీవల నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై నిరసన తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. "విద్యార్థులపై భాష్పవాయువు ప్రయోగం, లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, పెల్లెట్ గన్స్, ఏకే47లు వాడమని ఎవరు ఆదేశించారు? వారేమైనా ఉగ్రవాదులా?" అని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆమె ప్రశ్నించారు. దీనికి యావత్ దేశం సమాధానం కోరుకుంటోందని అన్నారు.



## విజయవాడ -గుంటూరుతో కలిపి అభివృద్ధి

**అమరావతి అంటే 29 గ్రామాలు కాదు**
**సీఎం చంద్రబాబు స్పష్టం**

**అమరావతి, మహా :** రాష్ట్ర రాజధాని అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతిని కేవలం 29 గ్రామాలకు మాత్రమే పరిమితమైన రాజధానిగా కాకుండా.. విజయవాడ, గుంటూరు నగరాలతో కలిపి సమగ్రాభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. మంగళగిరిలో జరిగిన సీఆర్ డీఏ సమీక్ష సమావేశంలో ఆయన రాజధాని అభివృద్ధి పనులపై కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి అమరావతి కేంద్ర బిందువుగా ఉండాలని పేర్కొంటూ.. రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో పాటు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# భూ వివాదాల్లేని తెలంగాణే లక్ష్యం

**రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, మహా** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీ సర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

# బీఆర్ఎస్ పాలనపై కవిత క్షమాపణలు స్వాగతిస్తున్నాం

- **రాజకీయాలకోసమే హైడ్రాపై పిటిషన్లు : మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మహా** : బీఆర్ఎస్ పాలనపై టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత క్షమాపణలు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గత పాలకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలని కవితకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాడారు. బీఆర్ఎస్ నేతలు డబుల్ 420 అని అభివర్ణించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. అసెంబ్లీకి వస్తే ఆయన మర్యాదకు ఇబ్బంది రానివ్వమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైడ్రా మంచిదని సాధారణ ప్రజలు చెబుతున్నారని తెలిపారు. హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారని చెప్పారు. అయితే హైడ్రా విషయంలో హైకోర్టు తీర్పును గౌరవిస్తామని స్పష్టం చేశారు. తాము చెప్పాల్సింది కోర్టుకు చెబుతామని అన్నారు. రాజకీయం కోసమే హైడ్రాకు వ్యతిరేకమైన పిటిషన్లు వేస్తున్నారని ఆరోపించారు. హైడ్రాకి వ్యతిరేకంగా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. కోర్టు పూర్తి తీర్పు ఇంకా రాలేదని గుర్తు చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తోందంటూ బీఆర్ఎస్ పార్టీపై మంత్రి శ్రీధర్ బాబు నిప్పులు చెరిగారు.

# బుల్లి తెరకు మహర్దశ

- **టీవీ ఆర్టిస్టుల అవార్డులకు సర్కార్ ఆలోచన**
- **పీవీ పేరును పరిశీలిస్తున్నామన్న మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, మహా** : బుల్లితెర (టెలివిజన్) రంగానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తొలిసారిగా టెలివిజన్ రంగానికి రాష్ట్ర స్థాయి అవార్డులను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలో టెలివిజన్ అవార్డు కమిటీతో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం సమావేశమై అవార్డుల రూపకల్పనపై కీలక చర్చలు జరిపారు. అవార్డుల లోగో, పేరు, కేటగిరీలు, ఎంపిక విధానం వంటి అంశాలపై కమిటీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి.. అవార్డుల పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా ఉండాలని హితవు పలికారు. మాజీ ప్రధానమంత్రి, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు పేరును ఈ టీవీ అవార్డులకు పెట్టాలని కమిటీ సభ్యులు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ అవార్డుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కోట్లాది మంది ప్రేక్షకులకు వినోదంతో పాటు సామాజిక సందేశాలను కూడా టెలివిజన్ రంగం అందిస్తోందని పేర్కొన్నారు. నటీనటులు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు, యాంకర్లు, నిర్మాతలు, బాలల కార్యక్రమాలు, సామాజిక సందేశంతో కూడిన సీరియల్స్ వంటి అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహించేలా కేటగిరీలను రూపొందించాలని కమిటీకి మంత్రి సూచించారు .ఈ టీవీ అవార్డుల ప్రదానోత్సవాన్ని రాష్ట్ర ప్రతిష్ఠకు తగ్గట్టుగా నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం 2 లేదా 3 వేదికలను ప్రతిపాదించాలని మంత్రి కమిటీ సభ్యులను కోరారు. ఆ తర్వాత ముఖ్యమంత్రితో చర్చించి వేదికపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. టీవీ రంగంలో మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని.. అందువల్ల ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కోమటిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ముకుంద్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అవార్డుల మార్గదర్శకాలు, లోగో, పేరు, కేటగిరీలను త్వరగా ఖరారు చేయాలని ఆదేశించారు.

# వక్ఫ్ భూముల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ జిల్లాలో వక్ఫ్ భూముల పరిరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అక్రమ ఆక్రమణలను అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వక్ఫ్ పరిరక్షణ అలాగే సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, పెండింగ్‌లో ఉన్న అంశాలు, భూముల రికార్డుల నిర్వహణ, ఆక్రమణల నివారణ, శాఖల మధ్య సమన్వయంపై సమీక్ష నిర్వహించారు.వక్ఫ్ భూములకు సంబంధించిన ప్రతి అంశాన్ని చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, సర్వే, రిజిస్ట్రేషన్ తదితర శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన ఫిర్యాదుల పై వెంటనే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, జిల్లా రెవెన్యూ అధికారి విజయ లక్ష్మి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణిలు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి రమేష్, జిల్లా రిజిస్ట్రార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్‌లు, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్, ఇంత జార్గంజ్ సీఐ ఎంఏ షుకూర్, తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య కేసులో కీలక పురోగతి

**వరంగల్, క్రైమ్ ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన మహిళా పోలీస్ కానిస్టేబుల్ సాధు సంగీత ఆత్మహత్య కేసు దర్యాప్తులో కీలక పురోగతి సాధించిన పోలీసులు, ఈ కేసులో నిందితుడిగా ఉన్న తాండ్ర శ్రీధర్ (37), సివిల్ కానిస్టేబుల్ ను 28 7 2026 తేదీ మధ్యాహ్నం ములుగు రోడ్డు లోని పెద్దమ్మగడ్డ క్రాస్ రోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం చట్టపరమైన విధివిధానాల ప్రకారం స్వతంత్ర పంచుల సమక్షంలో విచారణ నిర్వహించగా, నిందితుడు తనకు కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులకు వెల్లడించారు. దర్యాప్తు సందర్భంగా నిందితుడి వద్ద నుండి రెండు ఒప్పో స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకోగా, వాటిలో ఒక ఫోన్ లో గూగుల్ ఫోటోస్ లో బాధితురాలికి సంబంధించిన ఫోల్డర్ లో 58 ఫోటోల తో పాటు ఒక వీడియో ఉన్నట్లు గుర్తించారు. వాటిని సాంకేతిక నిపుణుల సహాయంతో రెండు పెన్‌డ్రైవ్ లలో భద్రపరిచి, కోర్టు అవసరాలు అలాగే దర్యాప్తు నిమిత్తం స్వాధీనం చేసుకున్నారు. రెండవ ఫోన్ సాంకేతిక లోపం కారణంగా పనిచేయకపోవడంతో, రెండు మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ హైదరాబాద్ కు పంపించి శాస్త్రీయ విశ్లేషణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో డిజిటల్ ఆధారాలు, కాల్ రికార్డులు, ఫోటోలు, వీడియోల తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ సమాచారాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ దర్యాప్తును అన్ని కోణాల్లో కొనసాగిస్తున్నట్లు మట్వాడ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం నిష్పాక్షికంగా విచారించి, దర్యాప్తులో వెలుగులోకి వచ్చే ఆధారాల మేరకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# అన్నవరంలో 'కేకే కన్వెన్షన్' బరితెగింపు..!

- **చెరువు కాలువను మింగేసిన నిర్మాణం..**
- **వర్షపు నీటికి దారి లేక కాలనీలు జలమయం..**
- **చూసీ చూడనట్లు అధికార యంత్రాంగం!**




**అన్నవరం :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామంలోని సత్యదేవ గార్డెన్స్ ఎదురుగా ఉన్నటువంటి కే కే కన్వెన్షన్ సర్వే నంబర్-70లో సహజ నీటి ప్రవాహానికి కీలకమైన చెరువు అనుసంధాన కాలువపై "కేకే కన్వెన్షన్ అండ్ రూమ్స్" పేరుతో నిర్మాణాలు చేపట్టడం తీవ్ర వివాదానికి దారితీసింది. కాలువను ఆక్రమించి రేకుల షెడ్డు తో కళ్యాణ మండపం ఇతర నిర్మాణాలు నిర్మించడం వల్ల వర్షపు నీరు వెళ్లే మార్గం పూర్తిగా మూసుకుపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమీపంలోని నివాస ప్రాంతాలు, కాలనీలు, రహదారులు ప్రతి వర్షానికీ జలమయమవుతున్నాయని వారు చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, దశాబ్దాలుగా వర్షపు నీటిని చెరువుకు తరలిస్తున్న సహజ కాలువను ఆక్రమించి వ్యాపార సముదాయం నిర్మించడంతో నీటి ప్రవాహ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. వర్షం కురిసిన ప్రతిసారీ నీరు కాలనీల్లో నిలిచిపోతుండగా, ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ అంశంపై పలుమార్లు ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప, ఆక్రమణలను తొలగించే చర్యలు మాత్రం కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

చెరువు కాలువపై నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. నీటి వనరులను పరిరక్షించాల్సిన ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యమే అక్రమ నిర్మాణాలకు వరంగా మారిందని వారు ఆరోపిస్తున్నారు. చెరువులు, కాలువలు, సహజ నీటి ప్రవాహ మార్గాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అన్నవరం విషయంలో ఆ బాధ్యతను విస్మరించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.చెరువులు, కాలువల ఆక్రమణల విషయంలో న్యాయస్థానాలు పలుమార్లు కఠిన వ్యాఖ్యలు చేస్తూ, ఇరిగేషన్ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశిస్తున్నప్పటికీ, అన్నవరంలో మాత్రం ఆ చట్టాల అమలు ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు.

ఇదిలా ఉండగా, కమర్షియల్ అవసరాల కోసం నిర్వహిస్తున్న ఈ కే కే కన్వెన్షన్‌కు అవసరమైన భవన అనుమతులు, ట్రేడ్ లైసెన్స్, అగ్నిమాపక శాఖ అనుమతులు, పార్కింగ్ వంటి నిబంధనలు పాటించారా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. కనీస పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో శుభకార్యాలకు వచ్చే వాహనాలు ప్రధాన రహదారిపైనే నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఈ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందించినట్లు గ్రామస్థులు తెలిపారు. కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగించి సహజ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ప్రకటిస్తుండగా, మరోవైపు అన్నవరంలో సహజ నీటి ప్రవాహ మార్గాలపై నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. వర్షాకాలం మరింత ఉధృతమయ్యేలోపు జిల్లా యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకుని కాలువను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రజలను ముంపు ముప్పు నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





**కాలువ కబ్జా:** సాగునీటి కాలువను పూడ్చేసి రేకుల షెడ్డుతో తాత్కాలిక నిర్మాణంలా చూపించి లక్షల వ్యాపారం చేస్తున్నారు.
**ట్రాఫిక్ నరకం:** కనీస పార్కింగ్ స్థలం లేకపోవడంతో, పెళ్ళిళ్ల సీజన్లో వందలాది వాహనాలు ప్రధాన రోడ్డుపైనే నిలిచిపోయి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి.
**అధికారుల అండ?:** రైతులు ఎన్నో ఫిర్యాదులు చేసినా ఇరిగేషన్ అధికారులు కేవలం 'నోటీసుల' నాటకంతో కాలయాపన చేస్తున్నారు. శంఖవరం రెవెన్యూ, అన్నవరం పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.
**కరెంట్ శాఖ నిర్లక్ష్యం:** అసలు అనుమతి లేని ఈ అక్రమ కట్టడానికి విద్యుత్ శాఖ అధికారులు "కమర్షియల్ ట్రాన్స్‌ఫార్మర్" ఎలా అనుమతించారు? లంచాల మత్తులోనే ఈ పర్మిషన్లు ఇచ్చారా?

# డ్రంకెన్ డ్రైవ్ కేసులపై సమగ్ర విచారణ కొనసాగుతోంది

- **రూ.30 లక్షల అవినీతి జరిగిందన్న వార్తల్లో వాస్తవం లేదు..**
- **కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**



**కరీంనగర్, మహా :** కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) కేసులపై సమగ్ర విచారణ కొనసాగుతోందని, ఇప్పటివరకు జరిగిన విచారణలో రూ.30 లక్షల అవినీతి జరిగినట్లు ప్రచారంలో ఉన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన అంతర్గత విచారణలో భాగంగా 2025 మే 19న పద్మనగర్‌కు చెందిన బేతి రాజేందర్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడినప్పటికీ, కోర్టుకు హాజరుకాకుండానే కేసు డిస్పోజ్ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి నివేదికను డీఐజీకి సమర్పించగా, నిందితుడి నుంచి రూ.15 వేల లంచం తీసుకుని డూప్లికేట్ ఎస్‌టీసీ (Summary Trial Case) నంబర్ నమోదు చేసి కేసును అక్రమంగా డిస్పోజ్ చేసినట్లు ఆధారాలు లభించాయని చెప్పారు. దీంతో ఆర్ఎస్ఐ శనిగల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ కె. సాయికృష్ణ, డీడీ డిస్పోజల్ స్టేషన్ కానిస్టేబుల్ ఎన్. కిరణ్‌లపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా డీఐజీ ఇప్పటికే సస్పెన్షన్ విధించినట్లు వెల్లడించారు.

ఈ ఘటన అనంతరం 2025 జనవరి నుంచి 2026 జూన్ 30 వరకు కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఇతర పోలీస్ స్టేషన్లలో నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసులపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు సీపీ తెలిపారు.విచారణలో మొత్తం 113 కేసుల్లో డూప్లికేట్ లేదా రిపీటెడ్ ఎస్‌టీసీ నంబర్లు గుర్తించినట్లు చెప్పారు. వీటిలో 13 కేసుల్లో మాత్రమే అవినీతి జరిగినట్లు తేలిందన్నారు. మూడు కేసుల్లో నిందితులు కోర్టుకు హాజరు కాకుండానే రూ.6,000, రూ.3,000, రూ.1,000 జరిమానాలు చెల్లించినట్లు చూపించి కేసులను అక్రమంగా డిస్పోజ్ చేసినట్లు గుర్తించామని తెలిపారు. మరో పది కేసుల్లో కోర్టు విధించిన జరిమానాకు అదనంగా మొత్తం రూ.9,700 లంచంగా వసూలు చేసినట్లు వెల్లడించారు.

మిగిలిన 100 కేసుల్లో నిందితులు కోర్టులో హాజరై జరిమానా చెల్లించినప్పటికీ, కోర్టు రికార్డుల్లో కొన్ని కేసులకు డూప్లికేట్ లేదా రిపీటెడ్ ఎస్‌టీసీ నంబర్లు కేటాయించినట్లు విచారణలో గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటివరకు జరిగిన విచారణలో మొత్తం 14 కేసుల్లో రూ.34,700 మేర అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయిందని, మీడియాలో ప్రచారంలో ఉన్నట్లు రూ.30 లక్షల అవినీతి జరిగిందనే వార్తలు అవాస్తవమని సీపీ గౌష్ ఆలం స్పష్టం చేశారు. పూర్తి స్థాయి విచారణ ఇంకా కొనసాగుతోందని తెలిపారు.

ఈ సందర్భంగా వాహనదారులకు సీపీ సూచనలు చేస్తూ, డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారు తప్పనిసరిగా సంబంధిత కోర్టులో హాజరై జరిమానాను నేరుగా కోర్టు సిబ్బందికే చెల్లించాలని సూచించారు. ఎవరైనా పోలీసులు అదనపు డబ్బులు డిమాండ్ చేసినా లేదా డబ్బులు తీసుకుని కోర్టుకు హాజరు కాకుండానే కేసులు డిస్పోజ్ చేస్తామని చెప్పినా వెంటనే పోలీస్ కమిషనర్ కార్యాలయానికి లేదా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నచ్చలేదా..వదిలెయ్

**హైదరాబాద్, మహా :** హీరో అల్లు అర్జున్ ప్రతి ఏడాది నిర్వహించే ఫ్యాన్స్ మీట్.. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాడు. అభిమానులతో కలిసి ముచ్చటించాడు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రోల్స్ గురించి తమని విమర్శించే వారి గురించి స్పందించాడు. నచ్చలేదా వదిలేయ్ అని చెప్పుకొచ్చాడు. 'టైమ్ అనుకోండి ఎనర్జీ అనుకోండి ఏమైనా అనుకోండి. ప్రతి మనిషికి ఒక రోజు ఉంటుంది. ప్రతిరోజు మనం 100 శాతం ఛార్జింగ్ అవుతాం. అదే రోజు ఆ ఛార్జింగ్ అంతా అయిపోతుంది. దీనిని నువ్వు ఏమైనా అనుకో. నువ్వు అది దేనికి వాడతావ్ అనేది నీ ఇష్టం. ఎవరైనా నచ్చకపోతే వారిని ద్వేషిస్తూ, ట్రోల్ చేస్తూ మీ సమయాన్ని వేస్ట్ చేసుకోవద్దు. మీ సమయం, ఎనర్జీని మీకు నచ్చిన పనిపైనే పెట్టండి. నచ్చని విషయాల కోసం ఒక్క శాతం ఖర్చు పెట్టొద్దు. నచ్చలేదా వదిలేయ్. కనీసం నీకు నచ్చిన అమ్మాయి ఇంటి బయట నిల్చో. కనీసం నువ్వైనా ఎంజాయ్ చేస్తావు' అని అల్లు అర్జున్ చెప్పాడు.

# రహదారులు మౌలిక వసతుల బలోపేతానికి కేంద్రం సహకారం అందించాలి

- **కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యే**



**వరంగల్, బ్యూరో మహా;** రంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారుల అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారి పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని కరుణాపురం నుండి పెద్ద పెండ్యాల, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, ధర్మసాగర్ మండల హెడ్‌క్వార్టర్, దేవునూర్, సోమ దేవరపల్లి, దామెర, ఎల్కతుర్తి మండల హెడ్‌క్వార్టర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఈ రోడ్డు హైదరాబాద్ నుండి కరీంనగర్, సిద్ది పేటకు వెళ్లే వాహనాలు వరంగల్ వెళ్లే అవసరం లేకుండా 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు నిత్యం వినియోగిస్తున్నారని వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే యాదాద్రి-వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్163) నాలుగు లైన్ల విస్తరణ సమయంలో పలు గ్రామాల్లో నిర్మించిన సర్వీస్ రోడ్ల మధ్య మిగిలిపోయిన లింకులను పూర్తి చేయాలని కోరారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు ఉన్నప్పటికీ వాటి మధ్య అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని వివరించారు. అవసరమైన భూమి ఇప్పటికే సేకరించిన నేపథ్యంలో మిగిలిన లింకుల నిర్మాణానికి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కేంద్ర రోడ్డు, మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) 2025-26 కింద తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన అదనపు రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని కోరారు. అంతేకాకుండా నర్సంపేట-నందిగామ రహదారి విస్తరణ, భట్టుపల్లి-హంటర్ రోడ్ మార్గ అభివృద్ధి పనులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలైతే గ్రామీణ ప్రాంతాల అనుసంధానం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.



# రైతు నేస్తం 100వ ఎపిసోడ్ విజయవంతం

హనుమకొండ, మహా: వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. వ్యవసాయ శాఖ నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించగా, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పెసర, కందులు, నువ్వులు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమం అనంతరం ప్రగతిశీల రైతులను సన్మానించి, విత్తనాలను పంపిణీ చేశారు.

# ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

- **మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**



**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, కూరగాయలు, బియ్యం, నిత్యావసర సరుకులను పరిశీలించి వాటి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతి, పరిశుభ్రత, తాగునీరు తదితర సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు.అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రత పై ఆరా తీశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇటీవల పాఠశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు దుప్పట్లు కావాలని ఎమ్మెల్యే నీ కోరడంతో మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డాక్టర్ సత్య శారద తో కలిసి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆటలకు అవసరమైన సామాగ్రి కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో , అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి ,ఏడిఈ నర్సింగం , ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు .



# ఉత్తరాంధ్ర ఉషస్సు.. భోగాపురం విమానాశ్రయం

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నిజమయ్యే చారిత్రక ఘడియలు సమీపించాయి. ప్రాంతీయ ఆర్థిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయగల అద్భుత శక్తి ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (ఏఎస్ఆర్ ఎయిర్ పోర్ట్) ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. సరిగ్గా ఆగస్టు 1న దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. కేవలం ప్రయాణ సౌకర్యాల కల్పనకే పరిమితం కాకుండా, ఈ మహా ప్రాజెక్టు ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని పారిశ్రామిక, ఆర్థిక, సాంకేతిక, పర్యాటక రంగాల్లో అగ్రగామిగా నిలపడానికి ఒక తిరుగులేని గ్రోత్ ఇంజిన్‌గా పనిచేయబోతోంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రూపురేఖలను మార్చే ఈ బృహత్తర ప్రాజెక్టు వెనుక పదుల సంఖ్యలో ఉన్న ప్రత్యేకతలు, అంకెలు మరియు కోట్లాది రూపాయల పెట్టుబడుల విశేషాలు ఈ ప్రాంతాన్ని గ్లోబల్ మ్యాప్‌లో నిలపబోతున్నాయి. విశాఖపట్నానికి సమీపంలోని భోగాపురం కేంద్రంగా రూపుదిద్దుకున్న ఈ బృహత్తర ప్రాజెక్టును విశాలమైన 2,703 ఎకరాల సువిశాల భూభాగంలో రూ.4,727 కోట్ల భారీ అంచనా వ్యయంతో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రపంచ స్థాయి ఏవియేషన్ ప్రమాణాలకు అనుగుణంగా, అత్యంత భారీ వైడ్‌బాడీ విమానాలు సైతం ఎలాంటి అంతరాయం లేకుండా సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ఇక్కడ ఏకంగా 3,800 మీటర్ల పొడవు మరియు విశాలమైన వెడల్పుతో రన్‌వేను రూపకల్పన చేశారు. తొలి దశలోనే ఏటా సుమారు 60 లక్షల మంది ప్రయాణికులకు అత్యుత్తమ, అంతర్జాతీయ స్థాయి సేవలు అందించే సామర్థ్యాన్ని ఈ విమానాశ్రయం సంతరించుకోవడం విశేషం. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి తగురీతిలో దీని సామర్థ్యాన్ని కోట్లాది మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడం దీని దూరచూపునకు నిదర్శనం.

కేవలం రాకపోకల కేంద్రంగానే కాకుండా, ఈ ప్రాజెక్టును భవిష్యత్ పారిశ్రామిక మరియు విమానయాన అవసరాలకు అనుగుణంగా ఒక సమగ్ర ఏవియేషన్ ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా విమానాశ్రయానికి అనుబంధంగా 500 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అత్యాధునిక ఏవియేషన్ హబ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అంతేకాకుండా, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో 136 ఎకరాల్లో ప్రత్యేకంగా ఏవియేషన్ ఎడ్యుసిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల విమానయాన రంగంలో సరికొత్త సాంకేతిక నైపుణ్యాలు, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, పైలట్ శిక్షణ వంటి అంశాలలో మానవ వనరులు స్థానికంగానే తయారడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పరిశోధనలకు ఈ ప్రాంతం కేంద్రీకృతమై నిలవనుంది. ఈ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర పారిశ్రామిక మరియు వాణిజ్య రంగానికి సరికొత్త రెక్కలు రానున్నాయి. ఏటా 25 వేల మెట్రిక్ టన్నుల భారీ కార్గో నిర్వహణ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోవడం ఇక్కడి ఎగుమతిదారులకు ఒక గొప్ప వరం కానుంది. ఈ ప్రాంతంలోని మత్స్య సంపద, సముద్ర ఉత్పత్తులు, హస్తకళలు, ఫార్మాస్యూటికల్స్, ఐటీ మరియు ఇతర తయారీ రంగ ఉత్పత్తులు నేరుగా అంతర్జాతీయ మార్కెట్లకు వేగంగా ఎగుమతి అయ్యేందుకు ఈ కార్గో సేవలు ఎంతో దోహదపడతాయి. దీని ద్వారా స్థానిక వ్యాపారాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊహించని స్థాయిలో వృద్ధి అవకాశాలు లభించడంతో పాటు గ్లోబల్ సప్లై చైన్‌లో ఉత్తరాంధ్ర కీలక భాగస్వామిగా మారుతుంది.

**ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక**

భోగాపురం విమానాశ్రయం రాకతో ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థ అనూహ్యమైన వేగంతో పరుగులు పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు రూ.20,000 కోట్ల మేర భారీ పెట్టుబడులు వస్తాయని అధికారిక, పారిశ్రామిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పెట్టుబడుల ప్రవాహం వల్ల ప్రత్యక్షంగానే దాదాపు 60 వేల మంది యువతకు నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు సృష్టించబడి, స్థానిక వ్యాపారాలు, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, ఆతిథ్య మరియు హోటల్ రంగాలు విశేషమైన వృద్ధిని సాధించి, ఈ ప్రాంతాన్ని దక్షిణ భారతదేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రంగా మలచనున్నాయి. ఈ విమానాశ్రయం కేవలం ఆర్థిక కేంద్రంగానే కాకుండా, ఉత్తరాంధ్ర సుందరమైన పర్యాటక రంగ అభివృద్ధికి ప్రధాన వారధిగా నిలవనుంది. విశాఖపట్నం తీరప్రాంతం, అరకు లోయల అందాలు, బొర్రా గుహలు, కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు గల చారిత్రక ప్రదేశాలను ఆస్వాదించేందుకు విదేశీ మరియు దేశీయ పర్యాటకుల రాకపోకలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే విశాఖ నుంచి భోగాపురం వరకు ఆరు వరుసల రహదారులు, మెట్రో రైలు ప్రతిపాదనలు, ఇతర మౌలిక వసతులు శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా, ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో ఉత్తరాంధ్ర ప్రజల కలల ప్రయాణం ఇక అనితర సాధ్యమైన రీతిలో విశ్వ విప్లవాన్ని సృష్టించడంలో ఎలాంటి సందేహం లేదు.

**- గడల నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్**

# ప్రకృతితో మనమెక్కడ విడిపోయాం?



సహజ వనరులను కేవలం మన అవసరాలు తీర్చే సాధనాలుగా చూడటం ఆధునిక దృక్పథం. కానీ భారతీయ సంప్రదాయంలో ప్రకృతి అనేది సాక్షాత్తూ దైవ స్వరూపం. అడవులను నరకడం, నీటిని కలుషితం చేయడం లేదా ప్రకృతిని నాశనం చేయడం సాక్షాత్తూ ఈశ్వరుడిని అగౌరవపరచడమే. ప్రతి సంవత్సరం జూలై 28న జరుపుకునే 'ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం' కేవలం ఒక ఆధునిక పర్యావరణ దినోత్సవం మాత్రమే కాదు. ఇది అనాదిగా భారతీయ సంప్రదాయంలో, సనాతన ధర్మంలో అంతర్భాగమైన 'ప్రకృతి ఆరాధన'ను మరోమారు గుర్తుచేసుకునే సందర్భం. అడవులు, నదులు, వన్యప్రాణుల రక్షణ కోసం ఆధునిక ప్రపంచం ఇప్పుడు చెబుతున్న సూత్రాలను, మన పూర్వీకులు వేల ఏళ్ల క్రితమే సనాతన ధర్మంగా ప్రకృతి ఆరాధనను తమ దైనందిన జీవన విధానంగా మలుచుకున్నారు. సహజ వనరులను కేవలం మన అవసరాలు తీర్చే సాధనాలుగా చూడటం ఆధునిక దృక్పథం. కానీ భారతీయ సంప్రదాయంలో ప్రకృతి అనేది సాక్షాత్తూ దైవ స్వరూపం. అథర్వణ వేదంలోని భూమి సూక్తం "మాతా భూమిః పుత్రోహం పృథివ్యాః" (భూమి నా తల్లి, నేను ఆమె పుత్రుడిని) అని తెలియజేస్తుంది. వృక్షాలను (రావి, మర్రి, వేప, తులసి, ఉసిరి), నదులను (గంగా, యమున, కావేరి, నర్మద, గోదావరి), పర్వతాలను దైవంగా పూజించడం మనకు తరతరాలుగా వస్తున్న ఆచారం. జీవవైవిధ్యాన్ని కాపాడటం కోసం మన పూర్వీకులు చెట్లను, జంతువులను దేవతల వాహనాలుగా, ప్రతిరూపాలుగా మలిచి వాటికి రక్షణ కల్పించారు. మహాదేవునికి ప్రతిరూపం పర్యావరణమే అని సర్వాంతర్యామిత్వాన్ని అంటే సృష్టిలోని అణువణువులో శివుడే ఉన్నాడనే సత్యాన్ని, ప్రకృతికి, పరమాత్మకు ఉన్న అద్వైత స్థితిని 'కృష్ణ యజుర్వేదం, తైత్తిరీయ సంహిత'లోని 'రుద్ర సూక్తం' (శ్రీ రుద్రం) అద్భుతంగా వర్ణిస్తుంది. ఇందులో శివుడిని ప్రకృతి స్వరూపుడిగా, అడవులకు, చెట్లకు, పర్వతాలకు అధిపతిగా స్తుతిస్తారు. "నమో వృక్షాణాం పతయే నమో నమః" వృక్షాలకు అధిపతి అయిన రుద్రునికి నమస్కారం అని.."నమో ఓషధీనాం పతయే నమో నమః" మూలికలకు, వనౌషధులకు అధిపతికి నమస్కారం అని.. మానవాళిని, పశుపక్ష్యాదులను కాపాడే సర్వాంతర్యామిగా శివుడిని 'పశుపతి' అని కీర్తించారు. ఈ మంత్రం 'పరమశివుడు ప్రతి ఆకులో, ప్రతి నీటి బొట్టులో, ప్రతి కొండలో కొలువై ఉన్నాడని చెబుతున్నాయి. కాబట్టి అడవులను నరకడం, నీటిని కలుషితం చేయడం లేదా ప్రకృతిని నాశనం చేయడం సాక్షాత్తూ ఈశ్వరుడిని అగౌరవపరచడమే' అని రుద్ర సూక్తం మనకు బోధిస్తోంది. భారతీయ పర్యావరణ తత్వశాస్త్రానికి మూలస్తంభం 'పంచభూత ఆరాధన'. భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం ఈ ఐదింటి కలయికే సృష్టి. ఈ ఐదు మూలకాలను జడ పదార్థాలుగా కాకుండా, సాక్షాత్తూ దైవ స్వరూపంగా ఆరాధించడం మన సంస్కృతి. దక్షిణ భారతదేశంలోని శివాలయాలను గమనిస్తే, పరమశివుడు పంచభూత లింగాల రూపంలో కొలువై ఉంటాడు. జలానికి జంబుకేశ్వరం, వాయువుకు శ్రీకాళహస్తి, అగ్నికి అరుణాచలం మొదలైనవి. గాలిని, నీటిని, భూమిని కలుషితం చేయకుండా స్వచ్ఛంగా ఉంచడమే నిజమైన ఈశ్వర ఆరాధన అని, ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే ప్రళయం తప్పదని ఈ పంచభూత భావన మనకు బోధిస్తోంది.

ఆధునిక నాగరికతకు దూరంగా ఉన్నప్పటికీ, భారతదేశంలోని వివిధ గిరిజన, స్థానిక తెగలు ప్రకృతితో మమేకమై జీవిస్తూ అడవులకు రక్షకులుగా నిలుస్తున్నారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు మనకు ఈ జీవనవిధానం కనిపిస్తుంది. మన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో గోండులు, కోయలు, నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే 'చెంచు' గిరిజనులు అడవిని తమ సొంత తల్లిగా భావిస్తారు. శ్రీశైల మల్లికార్జున స్వామిని తమ అల్లుడిగా (చెంచు మల్లయ్య), భ్రమరాంబా దేవిని తమ ఆడపడుచుగా ఆరాధిస్తున్నారు. అడవిలోని జంతువులతో సహజీవనం చేస్తూ, తమ అవసరానికి మించి చెట్టునుండి ఒక్క కొమ్మను కూడా విరవకుండా, వన్యప్రాణులకు ఎటువంటి హాని కలగకుండా ప్రకృతితో మమేకమై జీవించే చెంచుల విధానం ఆధునిక పర్యావరణవేత్తలకు ఆదర్శం. కర్ణాటకలోని కొడగు (కూర్గ్) ప్రాంతానికి చెందిన కొడవ జాతి ప్రజలు ప్రకృతిని ప్రత్యక్ష దైవంగా కొలుస్తారు. వారు కావేరి నదిని సాక్షాత్తూ 'కావేరి మాత'గా ఆరాధిస్తూ, ప్రతీ సంవత్సరం 'కావేరి సంక్రమణ' పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. అంతేకాకుండా, 'దేవరకాడు' పేరిట అడవిలోని కొంత భాగాన్ని దేవునికి అంకితం చేస్తారు. ఆ పవిత్ర వనాలలో చెట్లను నరకడం, వేటాడటం పూర్తిగా నిషేధం. దీని ద్వారా అద్భుతమైన జీవవైవిధ్యం (బయోడైవర్సిటీ) అక్కడ రక్షించబడుతోంది. తమిళనాడులోని నీలగిరి అటవీ ప్రాంతం ప్రకృతి ఆరాధనకు నిలయం. ఇక్కడ నివసించే తోడ తెగ పచ్చని గడ్డి భూములను, తమ పశువులను దైవంగా భావిస్తారు. ప్రకృతిలోని పర్వత శిఖరాలను, నీటి బుగ్గలను పవిత్రంగా ఆరాధిస్తూ, అటవీ వనరులను అత్యంత సుస్థిరంగా వినియోగించుకుంటున్నారు. కోట, బడగ తెగలు వ్యవసాయం, హస్తకళల మీద ఆధారపడే ఈ తెగలు రుతువుల మార్పులను బట్టి పండుగలు చేసుకుంటూ మాతృభూమికి, ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుకుంటారు. వ్యవసాయ భూమిని దేవుడిగా కొలుస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్న విషయాలు పర్యావరణ పరిరక్షణకు సజీవ ఉదాహరణలు. రాజస్థాన్‌లోని బిష్ణోయ్ తెగ వృక్షాల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం అర్పించిన చరిత్ర, 'ఖేజ్రీ' వృక్షాలను నరకకుండా అడ్డుకుంటూ 'అమృతా దేవి' నేతృత్వంలో 363 మంది ప్రాణత్యాగం చేసిన వారి స్ఫూర్తి ప్రపంచ పర్యావరణ చరిత్రలోనే సాటిలేనిది. జంతువులను, ముఖ్యంగా కృష్ణ జింకలను వీరు తమ బిడ్డల్లా కాపాడుకుంటున్నారు. అదేవిధంగా మహారాష్ట్ర పశ్చిమ కనుమల్లోని స్థానికులు గ్రామ దేవతల పేరుతో అడవులను 'దేవ్రాయ్' అనే పవిత్ర వనాలుగా సంరక్షిస్తున్నారు. కేరళలో ప్రతి ఇంటికి అనుబంధంగా ఉండే 'కావు' లేదా సర్పకావులు పాములకు, చెట్లకు నిలయమైన చిన్న పవిత్ర వనాలు. ఇవి స్థానిక పర్యావరణ వ్యవస్థను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో సంతాల్, ముండా, హో తెగలు సాల వృక్షాలను పూజించే 'సార్నా' సిద్ధాంతం అంటే ప్రకృతిని పూజించడమే వారి ఏకైక మార్గంగా పాటిస్తున్నారు. ఒడిశాలోని డోంగ్రియా కొండ్ తెగ ఆరాధ్య దైవం నియాంగిరి కొండలను, మైనింగ్ నుండి రక్షించుకోవడం చారిత్రాత్మక విషయం. మేఘాలయలో ఖాశీ, జయంతియా తెగలు సంరక్షించుకునే 'లా క్యింటాంగ్' పవిత్ర అడవుల నుండి కనీసం ఒక ఎండిన ఆకును కూడా బయటకు తీసుకురావడం నిషిద్ధం. పశ్చిమ బెంగాల్ లో సుందర్బన్స్ మడ అడవులలో, స్థానికులు పులులను మరియు తమను రక్షించే అటవీ దేవత 'బోన్ బీబీ'ని పూజిస్తూ అడవితో సమతుల్యత పాటిస్తారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో స్థానిక దేవతల పేరిట దేవదారు వృక్షాల అడవులను అత్యంత పవిత్రంగా కాపాడుకుంటారు. ఈ స్ఫూర్తితోనే చెట్లను హత్తుకుని కాపాడే 'చిప్కో మూమెంట్' పుట్టింది.

ఒకవైపు మనం ప్రకృతిని ఇంతలా గౌరవిస్తున్నప్పటికీ, అంతర్జాతీయంగా పారిశ్రామికీకరణ, స్వార్థం కారణంగా నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఈ పర్యావరణ సంక్షోభం ఆపేందుకు 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సదస్సు ఆధునిక పర్యావరణ ఉద్యమానికి బీజం వేసింది. ప్రస్తుతం 48,000 కంటే ఎక్కువ జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వలస వెళ్లే జాతులలో సగానికి పైగా జనాభా క్షీణతను ఎదుర్కొంటున్నాయి. కేవలం 2025లో సుమారు 4.3 మిలియన్ హెక్టార్ల ఉష్ణమండల అడవులు ధ్వంసమయ్యాయనే, ఈ కఠిన వాస్తవాలు నేటి ప్రపంచం అంగీకరించాల్సిందే. వాతావరణ మార్పుల వల్ల అడవుల్లో మంటలు, వరదలు, కరువులు తీవ్రమవుతున్నాయి. 2022లో ఆమోదించబడిన 'కున్మింగ్‌మాంట్రియల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్' మరియు ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్' (ఐయుసిఎన్) సంస్థలు 2030 నాటికి ఈ జీవవైవిధ్య నష్టాన్ని అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ లక్ష్య సాధనలో 'ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం 2026' ఒక కీలకమైన మైలురాయి. దీనికి అనుగుణంగా మన భారత ప్రభుత్వం కూడా విధానపరమైన నిర్ణయాలు, జాతీయ స్థాయి కార్యక్రమాల ద్వారా ప్రకృతి సంరక్షణకు మద్దతు ఇస్తోంది. మిషన్ లైఫ్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ పేరుతో పర్యావరణానికి అనుకూలమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి పౌరుడు నీరు, విద్యుత్ ఆదా చేయడం మరియు వ్యర్థాలను తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. పచ్చదనాన్ని పెంచడానికి "ఏక్ పేడ్ మా కే నామ్" అంటే అమ్మ పేరుతో ఓ వృక్షం వంటి వినూత్న కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది. దీని ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది చెట్లను నాటే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి, సోలార్ మరియు విండ్ ఎనర్జీ వాడకాన్ని పెంచడం. 2070 నాటికి కర్బన ఉద్గారాలను నెట్ జీరో చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రాజెక్ట్ టైగర్, ప్రాజెక్ట్ లయన్, మరియు ప్రాజెక్ట్ చీతా వంటి కార్యక్రమాల ద్వారా అంతరించిపోతున్న వన్యప్రాణులను రక్షించడం. స్వచ్ఛ భారత్ మిషన్ & నమామి గంగే ప్రోగ్రామ్ ద్వారా దేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం, గంగా నదితో పాటు ఇతర ప్రధాన నదులను కాలుష్య రహితంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంటి జాతీయ వాద సంస్థలు కూడా సంస్థాగతంగా, క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరుస్తూ తద్వారా పర్యావరణ సంరక్షణలో చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. పర్యావరణ సంరక్షణ గతివిధి (పి.ఎస్.జి) పర్యావరణ పరిరక్షణ కోసమే ఆర్ఎస్ఎస్ ప్రత్యేకంగా ఈ విభాగాన్ని ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న స్వయంసేవకులు దీని ద్వారా పనిచేస్తున్నారు. వృక్షారోపణ (ట్రీ ప్లాంటేషన్) కార్యక్రమాలు ద్వారా వర్షాకాలంలో, ప్రకృతి సంరక్షణ దినోత్సవం వంటి ప్రత్యేక రోజుల్లో స్వయంసేవక్ లు వేలాది గ్రామాల్లో, నగరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తారు. నీటి సంరక్షణ (వాటర్ కన్సర్వేషన్) లో భాగం గా వర్షపు నీటిని నిల్వ చేయడం (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్), చెరువుల పూడిక తీయడం మరియు జల వనరుల పునరుద్ధరణ వంటి పనుల్లో స్వయంసేవకులు శ్రమదానం చేస్తుంటారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం మరియు పర్యావరణానికి హాని చేయని ఎకోఫ్రెండ్లీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మట్టి వినాయక విగ్రహాల తయారీ, పర్యావరణానికి హాని కలగని రంగులతో హోలీ జరుపుకోవడం వంటి సంప్రదాయాలను పర్యావరణ అనుకూల పండుగలుగా ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టాలు, నిధులు మరియు జాతీయ విధానాల ద్వారా ప్రకృతి సంరక్షణకు బాటలు వేస్తుండగా.. తమ బాధ్యతగా ఆర్ఎస్ఎస్ వంటి ప్రముఖ జాతీయ వాద సంస్థలు దేశనిర్మాణమే కర్తవ్యంగా సువిశాలమైన కార్యకర్తల నెట్ వర్క్ ద్వారా అటువంటి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారిలో పర్యావరణ స్పృహను పెంచడంలో క్షేత్రస్థాయిలో సహాయపడుతున్నారు.

ఆరోగ్యకరమైన పర్యావరణమే మన మనుగడకు ఆధారం. అడవులు గ్లోబల్ వార్మింగ్ కు కారణమయ్యే కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహిస్తాయి. చిత్తడి నేలలు సహజ ఫిల్టర్లలా పనిచేసి నీటిని శుద్ధి చేస్తాయి, వరద ప్రమాదాలను తగ్గిస్తాయి. పరాగసంపర్క కీటకాలైన తేనెటీగలు, తుమ్మెదలు, సీతాకోక చిలుకలు లేకపోతే ప్రపంచ ఆహార ఉత్పత్తి ఆగిపోతుంది. జూలై 28, ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం భవిష్యత్ తరాలకు సురక్షితమైన, పచ్చని భూమి అందించడం మన బాధ్యత మాత్రమే కాదు, మన తక్షణ కర్తవ్యం. పంచభూతాల ఆరాధన, రుద్ర సూక్తం, బిష్ణోయ్ వీరుల ప్రాణత్యాగం, చెంచుల అడవితల్లి ప్రేమ, మేఘాలయ పవిత్ర వనాలు, కేరళ సర్పకావులు... ఇవన్నీ ప్రకృతితో మమేకమైన మన ఘనమైన భారతీయ సంస్కృతికి సజీవ సాక్ష్యాలు. ఈ ప్రాచీన పర్యావరణ విజ్ఞానాన్ని, ఆధునిక శాస్త్ర సాంకేతికతతో అనుసంధానించడమే నేటి అవసరం. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడం, ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టడం, వృక్షాలను దైవసమానంగా సంరక్షించడం అనే పర్యావరణ అనుకూల జీవనశైలిని మనం గర్వంగా ఆచరిద్దాం. ఆధునిక విజ్ఞానం సూచిస్తున్న సుస్థిర (సస్టైనబుల్) విధానాలను పాటిస్తూ ప్రకృతి మాతకు నిజమైన నివాళి అర్పిద్దాం. ఇదే మనం రాబోయే తరాలకు ఇచ్చే అమూల్యమైన బహుమతి! ప్రకృతిని రక్షించడమంటే సాక్షాత్తూ దైవాన్ని పూజించడమే! జై హింద్. భారత్ మాతా కీ జై!

**(శివకుమార్ గనివాడ, సీనియర్ సామాజిక విశ్లేషకులు)**

# విదేశీ నిధుల నియంత్రణ చట్టంతో కేంద్రం ఉక్కుపాదం




యువత ప్రశ్నలకు జవాబేదీ?

దేశ భవిష్యత్తు గురించి మాట్లాడేటప్పుడు మనం తరచూ "యువతే భారత బలం" అని చెబుతుంటాం. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న దేశంగా భారత్‌కు ఒకప్పుడు "డెమోగ్రాఫిక్ డివిడెండ్" అనే గొప్ప అవకాశం ఉందని ఆర్థికవేత్తలు, విధానకర్తలు విశ్వసించారు. కానీ నేడు పరిస్థితులు చూస్తే ఆ అవకాశం క్రమంగా ఆందోళనగా మారుతున్నట్లు కనిపిస్తోంది. విద్యలో అవినీతి, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, ఉద్యోగ అవకాశాల కొరత, నియామకాల్లో జాప్యం, యువతలో పెరుగుతున్న నిరాశ దేశ రాజకీయ వ్యవస్థ ముందున్న అత్యంత కీలక సవాళ్లుగా మారాయి.

ఇటీవలి రోజుల్లో విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత వీధుల్లోకి రావడం, ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా పోలీసుల జోక్యం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజల అసంతృప్తిని ప్రభుత్వానికి తెలియజేసే శాంతియుత మార్గాలను గౌరవించడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత. నిరసనలను అణచివేయడం కంటే వాటి వెనుక ఉన్న సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడమే సమర్థమైన పాలనకు నిదర్శనం.

ప్రస్తుతం దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పరీక్షలపై నమ్మకం కోల్పోవడమే. ఒక పరీక్ష కోసం లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడుతుంటారు. అలాంటి పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, అవకతవకలు, అక్రమాలు బయటపడితే విద్యార్థుల శ్రమ మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థపై ప్రజల విశ్వాసం కూడా దెబ్బతింటుంది. ప్రతిభకు బదులుగా అవినీతి గెలుస్తోందనే భావన యువతలో ప్రమాదకరమైన నిరాశను పెంచుతుంది.

ఇదే సమయంలో నిరుద్యోగం కూడా మరో పెద్ద సవాలుగా నిలుస్తోంది. చదువులు పూర్తిచేసిన తర్వాత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి అనేక కుటుంబాలను ఆర్థిక, మానసిక ఒత్తిడిలోకి నెడుతోంది. ప్రభుత్వ నియామక పరీక్షల ఆలస్యం, ఫలితాల వివాదాలు, కోర్టు కేసులు, రద్దైన పరీక్షలు యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ప్రతి యువకుడి వెనుక ఒక కుటుంబం ఆశలు ఉంటాయి. ఆ ఆశలు పదేపదే దెబ్బతింటే అసహనం పెరగడం సహజం.

ఈ పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. యువత సమస్యలను కేవలం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు పరిమితం చేయకుండా జాతీయ సమస్యగా చూడాలి. అధికార, ప్రతిపక్షాలు కలిసి విద్యా సంస్కరణలు, పారదర్శక నియామక వ్యవస్థ, పరీక్షల భద్రత, అవినీతిపై కఠిన చర్యలు వంటి అంశాలపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో యువతను ఓటర్లుగా మాత్రమే కాకుండా, విధానాల రూపకల్పనలో భాగస్వాములుగా గుర్తించాల్సిన సమయం వచ్చింది.

విద్యా వ్యవస్థలో సాంకేతికత వినియోగం, డిజిటల్ భద్రత, పరీక్షల నిర్వహణలో స్వతంత్ర పర్యవేక్షణ, ప్రశ్నాపత్రాల రహస్యతకు ఆధునిక ప్రమాణాలు అమలు చేయడం అత్యవసరం. అలాగే పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై రాజకీయ లేదా పరిపాలనా ప్రభావాలకు అతీతంగా వేగంగా విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలి. శిక్ష తప్పదనే సందేశం వెళ్లినప్పుడే ఇటువంటి నేరాలు తగ్గుతాయి.

యువత ఆవేదనను చట్టవ్యవస్థ సమస్యగా కాకుండా సామాజిక హెచ్చరికగా చూడాలి. దేశ అభివృద్ధికి ఇంజనీర్లు, వైద్యులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు అవసరం. వారిలో నిరాశ పెరిగితే అది వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు కూడా నష్టం. అందుకే యువతతో ప్రభుత్వం నిరంతర సంభాషణ కొనసాగించాలి. విద్యార్థి సంఘాలు, నిపుణులు, విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులతో కలిసి దీర్ఘకాలిక విద్యా, ఉపాధి విధానాలను రూపొందించాలి.

ప్రజాస్వామ్యం బలపడేది విమర్శలను అంగీకరించినప్పుడే. విభేదించే గొంతులను శత్రువులుగా కాకుండా భాగస్వాములుగా చూసే రాజకీయ సంస్కృతి పెరగాలి. శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్యానికి బలహీనత కాదు; అవి ప్రజల విశ్వాసానికి ప్రతీక. యువత తమ భవిష్యత్తు గురించి ప్రశ్నలు అడుగుతున్నప్పుడు వాటికి సమాధానాలు ఇవ్వాల్సింది రాజకీయ నాయకత్వమే. భారత్‌కు ఇంకా యువశక్తి అనే అపార సంపద ఉంది. కానీ ఆ సంపదను సద్వినియోగం చేసుకోవాలంటే విద్యపై నమ్మకం, ఉద్యోగాలపై ఆశ, పరిపాలనపై విశ్వాసం తిరిగి నెలకొల్పాలి. యువతను వినడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, పారదర్శకమైన సంస్కరణలు అమలు చేయడం ద్వారా మాత్రమే దేశం నిజమైన అభివృద్ధి దిశగా సాగుతుంది.

దేశ భవిష్యత్తు గురించి తీసుకునే ప్రతి నిర్ణయంలో యువత స్వరం వినిపించాలి. ఎందుకంటే నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులు. వారి ఆశలను కాపాడటం, అవకాశాలను కల్పించడం, న్యాయమైన వ్యవస్థను అందించడం ప్రతి ప్రభుత్వానిదీ, ప్రతి రాజకీయ పక్షానిదీ, అంతిమంగా ప్రతి ప్రజాస్వామ్య సమాజానిదీ బాధ్యత.

**అంతర్జాతీయ విమర్శల్లోని ద్వంద్వ ప్రమాణాలు:**

భారతదేశం తన జాతీయ భద్రతను, సార్వభౌమాధికారాన్ని రక్షించుకునే దిశగా కఠిన చర్యలు తీసుకుంటుంటే, అమెరికా చట్టసభల ప్రతినిధులు, విదేశీ సంస్థలు భయాందోళనలకు గురవుతున్నాయి. ఉదాహరణకు, అమెరికా సెనేట్ ఫారిన్ రిలేషన్స్ కమిటీకి నాయకత్వం వహిస్తున్న సెనేటర్ 'జేమ్స్ రిస్చ్' ఈ సవరణలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాతో సంబంధం ఉన్న క్రైస్తవ సంస్థల నిధులు, ఆస్తులను స్వాధీనం చేసుకుని, వారిపై వేధింపులకు పాల్పడటానికే ఈ ఎఫ్.సి.ఆర్.ఎ 2.0 చట్టాన్ని ఒక సాకుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అయితే ఇక్కడే వారి ద్వంద్వ ప్రమాణాలు బయటపడుతున్నాయి. అమెరికా దేశంలోకి వచ్చే విదేశీ నిధులను, విదేశీ ఏజెంట్లను నియంత్రించడానికి వాషింగ్టన్ డీసీలో 'ఎఫ్.ఎ.ఆర్.ఎ' లాంటి అత్యంత కఠినమైన చట్టాన్ని అమలు చేస్తున్నారు. తమ దేశ భద్రత కోసం చట్టాలు చేస్తే ఒప్పు అయినప్పుడు.. భారతదేశం తన సొంత గడ్డపై తన నాగరికతా ధర్మాన్ని, జాతీయ భద్రతను కాపాడుకోవడానికి పటిష్టమైన చట్టాలు చేస్తే అది క్రైస్తవ సంస్థలపై వేధింపు ఎలా అవుతుంది? అనామక కార్యకలాపాలను అడ్డుకుని, దేశ ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతోనే కేంద్రం ఈ ఎఫ్.సి.ఆర్.ఎ సవరణలకు రూపకల్పన చేసిందని స్పష్టమవుతోంది.

**అమరవాజీ నాగరాజు**
**జర్నలిస్ట్**



## వరా భావ పరిస్థితులను అధిగమించేందుకే జలసిరి

**ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను నిర్మించుకోవాలి జీడినగర్ సర్పంచ్**

**జీడినగర్, జులై 28 మంగళవారం** మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం జీడినగర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తుతున్న వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జలసిరి కార్యక్రమాన్ని చేపట్టిందని సర్పంచ్ సూర రమా తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ. భూగర్భ జలాలను పునర్జీవింపజేసేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.రైతులు తమ పంట పొలాల్లో వ్యవసాయ బావులను నిర్మించుకుని నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ఊరకుంటల ద్వారా వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసిపట్టి జల సంరక్షణకు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముత్యాల ఉదయ్ కుమార్, వార్డు సభ్యులు సట్ల అశోక్ గౌడ్, కంకటి శ్రీనివాస్,తపట్ల మోహన్,దొంతుల నిర్మల, గోల్కొండ రాజేశం,సూర స్వరూప, పంచాయతీ కార్యదర్శి ఆల్కా సంజీవ్, ఆశా వర్కర్లు, వీవో సభ్యులు మరియు గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### నేడు కొండగట్టు అంజన్న క్షేత్రంలో

## కొండగట్టు గిరి ప్రదక్షిణ

- **రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షా ల కోసం ప్రత్యేక ప్రార్థనలు**
- **రాజకీయాలకు అతీతంగా భక్తులందరూ పాల్గొనాలి..**
- **కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం**

**కరీంనగర్, మహా:** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 5 గంటలకు ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో శ్రీ ఆంజనేయ స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. మంగళవారం కరీంనగర్ నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ గిరి ప్రదక్షిణ ఏ రాజకీయ పార్టీకి, ఏ వర్గానికీ, ఏ మతానికీ సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ఎల్‌నీనో ప్రభావంతో ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోవాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

కొండగట్టు కేవలం ఆధ్యాత్మిక క్షేత్రం మాత్రమే కాకుండా పచ్చని ప్రకృతి అందాలతో అలరారే పవిత్ర స్థలమని పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు వస్తుంటారని చెప్పారు. దేశంలోనే అరుదుగా నరసింహమూర్తి, శివతత్త్వాల సమ్మేళన రూపంలో కొండగట్టు ఆంజనేయ స్వామి విగ్రహం వెలసి ఉండటం ఈ క్షేత్రానికి ప్రత్యేకతని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొండగట్టుతో పాటు వేములవాడ రాజ రాజేశ్వర స్వామి, బాసర సరస్వతి దేవి, కాళేశ్వరం, ధర్మపురి తదితర ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని, ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ఆధ్యాత్మిక దృక్పథంతోనే చూడాలని, రాజకీయాలకు దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నారాయణపూర్ రిజర్వాయర్ పనులపై స్పందిస్తూ, ప్రాజెక్టు పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే ఉద్దేశంతో కొందరు ప్రాజెక్టు పనులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలని అసెంబ్లీలో పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తయిన అనంతరం ముంపునకు గురయ్యే ప్రతి ఇంటికి పూర్తి స్థాయిలో పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన 40 ఇళ్లకు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి పరిహారం అందించినట్లు తెలిపారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రాజెక్టు ప్రాంతానికి తీసుకువచ్చి నిర్వాసితుల సమస్యలు, పరిహారం అంశాలపై సమగ్రంగా వివరించినట్లు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, చొప్పదండి సహకార పరపతి సంఘం చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గంగన్న, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి..

- **రాజన్న ఆలయ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి**
- **బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**



**వేములవాడ,మహా :** వేములవాడ రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ గారి ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ మండల బీజేపీ కార్యాలయంలో మంగొళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీ రెడ్డబోయిన గోపి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత యాసంగి సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నెలలు గడుస్తున్నా రైతులకు వారి కష్టార్జిత డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం తగదని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో చోటుచేసుకున్న కుంభకోణంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కేవలం కొందరిపై కేసులు నమోదు చేసి బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో ఎంతమంది రైతులు నష్టపోయారు, ఎంత మొత్తం దుర్వినియోగమైంది, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మర్రిపల్లి, మల్లారం, నూకలమర్రి గ్రామాలకు చెందిన రైతులు తమ బకాయిల కోసం ఆందోళనలు చేస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పవిత్ర శ్రావణమాసం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, వారికి తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, క్యూలైన్లు, వైద్య సేవలు తదితర అన్ని మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం, దేవాదాయ శాఖ సమర్థంగా కల్పించాలని కోరారు. అదేవిధంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కేటాయించిన నిధులు, ఖర్చులు, వాటి వినియోగంపై పూర్తి వివరాలతో ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా దేవస్థాన పరిపాలనలో పూర్తి పారదర్శకత ఉండాలని ఆయన అన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సురేందర్ రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్, హనుమాజీపేట సర్పంచ్ జింక మధు, ఎదురుగట్ల సర్పంచ్ కడారి సంధ్య తిరుపతి బొల్లారం సర్పంచ్ సండే సారి సౌజన్య మల్లికార్జున్ ఫాదర్ నగర్ ఉపసర్పంచ్ పోగుల రాకేష్ మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్ ప్రధాన కార్యదర్శి తోట శేఖర్ మండల పదాధికారులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ సాగు మేలు



**ఆదిలాబాద్ మహా:** రసాయనిక ఎరువులను తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపు నిచ్చారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్ గా నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ లో వారు పాల్గొన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక లో అధికారులు రైతులతో కలిసి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. యూరియా, డీఏపీల మితిమీరిన వాడకం వల్ల ప్రతికూల వాతావరణ ప్రభావాలు తీవ్రమవుతాయని కలెక్టర్ అన్నారు. ఆవు పేడ సేంద్రీయ ఎరువుల వినియోగంతో నేల సారం పెరుగుతుందని సూచించారు. ప్రకృతి సేద్యం చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. జిల్లాలో వర్షపాత లోటు ఉన్నందున అంతరసేద్యం, మల్చింగ్ ద్వారా తేమను కాపాడుకోవాలని సూచించారు.అలాగే జొన్న కొనుగోలు బకాయిలు రూ.130 కోట్లను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ పంటలు పండించి రైతులు లాభపడాలని ఎమ్మెల్యే అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ సాగు పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని, పూర్వకాలపు సేంద్రియ విధానాల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. ప్రైవేట్ వ్యాపారులు చెప్పే ఆచరణ సాధ్యంకాని హైబ్రిడ్ విత్తనాలు, హోమియో ఫెర్టిలైజర్ల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. తక్కువ నీటితో ఎక్కువ ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు సరైన మార్గదర్శనం చేయాలని ఆదేశించారు.అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యవసాయ అధికారులను, ఆదర్శ రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమెంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, ఎంఆర్ఓ రఘునాథ్, ఎంపీడీవో రైసుద్దీన్, ఏడీఏలు శ్రీధర్, రామ్ కిషన్, ప్యాక్స్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ అనిత, మండల వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ, ఉద్యాన, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య మెనూ ప్రకారం భోజనం అందించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



యాదాద్రి భువనగిరి జూలై 28 మహా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు,మెనూ ప్రకారం రుచికరమై భోజనం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. మంగళవారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా పరిశీలించి, ఉపాధ్యాయులందరూ విధులకు హాజరయ్యారా లేదా అని ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తున్నారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో త్రాగునీరు, నీటి సరఫరా సక్రమంగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. నిరంతర నీటి సరఫరా ఉందా అని, ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తొమ్మిదో తరగతి క్లాస్ రూమ్ కి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ లో మీరు ఏమి కావాలని అనుకుంటున్నారని, దానికోసం మీరు ఏమి చేయాలని అడిగారు, మంచిగా చదుకొని ఉన్నత స్థాయి కి చేరుకోవాలని సూచించారు. పాఠశాలలో నాణ్యమైన రుచికరమైన భోజనం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ప్రతిరోజూ క్రీడా తరగతులు నిర్వహిస్తున్నారా అని అడిగి వారికి ఇష్టమైన క్రీడలు ఏంటి అని అడిగి తెలుసుకున్నారు.విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారా, ఏయే అంశాలపై శిక్షణ ఇస్తున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు మెరుగైన అవగాహన కల్పించి, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణ అందించాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం మరియు తరగతుల నిర్వహణ మొదలైన అంశాల పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్ మరియు సిబ్బంది నాగేశ్వర రావు, కరుణాకర్, రవీందర్, శ్వేత, శ్రీధర్, లక్ష్మణ్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలు పరిష్కరించాలి

**వలిగొండ, మహా:**వలిగొండ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.వలిగొండ, వేములకొండ, వర్కట్‌పల్లి, వెలువర్తి ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, వైద్య సేవలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిప్పంగి స్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులు .. ఇబ్బందుల్లో ప్రజలు

- **పోలీస్ మున్సిపల్ చర్యలు**
- **గోశాలకు పశువులు**
- **నిర్లక్ష్యంగా వదిలిపెట్టిన యజమానులై కేసులు**



**ఆదిలాబాద్ మహా :** జిల్లా పోలీసు శాఖ, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో రోడ్లపై నిర్లక్ష్యంగా పశువులను వదిలిపెట్టే యజమానులపై చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, వాహనదారులకు ప్రమాదకరంగా మారిన 22 పశువులను గుర్తించి ఇచ్చోడ గోశాలకు తరలించామన్నారు. గోశాలలో పశువులు ఉన్నన్ని రోజులకు గాను విధించే నిర్వహణ రుసుములను సంబంధిత యజమానులే చెల్లించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నిర్లక్ష్యంగా తమ పశువులను రోడ్లపై వదిలిపెట్టి ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన ముగ్గురు యజమానులతో పాటు మరి కొందరి పై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపై వదిలివేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి పట్టణంలో అపరిష్కృత సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

- **గుంతలు పడ్డ రోడ్లు పూడ్చాలని డిమాండ్**
- **కాంట చౌరస్తా వద్ద మాజీ శాసన సభ్యులు దుర్గం చిన్నయ్య నేతృత్వంలో కళ్లకు గంతలు కట్టుకొని ధర్నా**

**బెల్లంపల్లి, మహా**:బెల్లంపల్లి పట్టణంలో అపరిష్కృత సమస్యలను టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజు మాజీ శాసన సభ్యులు దుర్గం చిన్నయ్య బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని రోడ్లు పూర్తిగా గుంతల మయం గా మారాయి ప్రజలు ప్రతిరోజు ప్రమాదాల మధ్య ప్రయాణిస్తున్నారుని స్థానిక శాసనసభ్యులు వినోద్ కనపడట్లేదా అని ,రోడ్ల విస్తరణ పేరుతో ఎన్నో కుటుంబాలను రోడ్డు పైకి తెచ్చారనీ, తమ ఇల్లు దుకాణాలు కోల్పోయిన వారికీ న్యాయం చేస్తామని చెప్పి నేటికీ పట్టించుకోలేదని, రోడ్ల విస్తరణ పేరుతో డబ్బులు వసూలు చేసే కార్యక్రమం మొదలు పెట్టుకుని వసూలు చేసుకున్నాక రోడ్ల విషయం మరిచారని, గురుకుల పాఠశాల లో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను పట్టించ్చుకోవట్లేదని, ఎన్నికల ముందు స్వంతగా ఇండస్ట్రీ లు పెడ్తా అన్నటువంటి ఏం ఎల్ ఏ కనీసం వచ్చిన ఫుడ్ ప్రాసెస్ యూనిట్ ని ఉపయోగం లోకి తీసుకు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్, పట్టణ అధ్యక్షులు నూనెటి సత్యనారాయణ, నాయకులు రేవెల్లి విజయ్, సబ్బని అరుణ్, కౌన్సిలర్లు తాండ్ర స్రవంతి, బండారి స్రవంతి బెడ్డల సౌజన్య, అసాది మధు, గోగర్ల స్వప్న, కొయ్యాడా ప్రసన్న, రజిత,రాజకుమార్, కాంపెల్లి రాజం, సిమ్రాన్ ఖలీం, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లను కలిసిన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్‌కే ఖదీర్ జన్మదినం సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఎస్‌కే ఖదీర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎస్‌కే ఖదీర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## ఏరియా ఆసుపత్రిలో సిఎంవో ఆకస్మిక తనిఖీ

**క్యాతనపల్లి మహా :** రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సీఎంఓ డా. కిరణ్ రాజ్ కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రికి చేరుకున్న సీఎంఓ పలు వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విధుల్లో ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది పనితీరును పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై పలువురు రోగులు సంతృప్తి వ్యక్తం చేయడంతో సీఎంఓ హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మధు కుమార్‌తో పాటు మొత్తం సిబ్బందిని అభినందించారు. కార్మికులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. మధు కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మదార్ సాహెబ్, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే పాయల్ పై మాజీ మంత్రి చురకలు

**ఆదిలాబాద్ మహా :** సొమ్మొక్కడిది సోకొక్కడిది అన్న చందంగా స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి జోగురామన్న విమర్శించారు. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియతో మాట్లాడారు. ఎయిర్‌పోర్టు విషయంలో క్రెడిట్ తమదంటే తమదని కాంగ్రెస్ బీజేపీ నాయకులు చెప్పుకుంటున్నారని అన్నారు. నిధులు మంజూరు చేస్తూ భూసేకరణకు సంబంధించిన జీవో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని దీనిపై ఎమ్మెల్యే తమ క్రెడిట్ గా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం నుంచి నిధులు రాలేదని స్పష్టం చేశారు. ఎయిర్ పోర్ట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇస్తే నువ్వు జబ్బలు చరుచుకోవడంమేంటని ప్రశ్నించారు. ఇలాంటి విషయంలో పాయల్ శంకర్ నంబర్ వన్ అన్నారు. ఎయిర్‌పోర్టు విషయంలో స్థానిక ఎమ్మెల్యే కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండానే తానే ఈ ప్రాజెక్టును తీసుకొచ్చానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కేంద్ర ప్రతినిధి అయిన ఎంపీ పాత్రను విస్మరించి నడుచుకోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో విజ్జగిరి నారాయణ, యూనిస్ అక్బాని, మెట్టు ప్రహ్లాద్, చందాల రాజన్న, సాజితుద్దీన్, బట్టు సతీష్, కుమ్రా రాజు తదితరులు పాల్గొన్నారు.



## శైలో బంకర్ బాధితులకు పొంగులేటి సుధాకర్ రెడ్డి పరామర్శ

**సత్తుపల్లి, జూలై 28: మహా** మండలంలోని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీ సమీపంలో నిర్మించిన శైలో బంకర్ (రైలు బొగ్గు లోడింగ్ పాయింట్) వల్ల తీవ్ర బొగ్గు కాలుష్యాన్ని ఎదుర్కొంటున్న బాధితులను బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, శైలో బంకర్ కాలుష్యానికి వ్యతిరేకంగా 34 రోజుల పాటు శాంతియుతంగా నిరసన చేపట్టగా, మంత్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నిరసన విరమించిన తర్వాత ఇప్పటి వరకు ఎవరూ తమ సమస్యను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరావాసానికి సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ, స్థలాల ఎంపిక పేరుతో నెలలు గడుస్తున్నా ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని బాధితులు వివరించారు. పలు ప్రాంతాలను పరిశీలించి నివేదిక అందించినా, అనుమతుల పేరుతో ఆలస్యం చేస్తూ సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని పొంగులేటి సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన పొంగులేటి సుధాకర్ రెడ్డి, అంబేద్కర్ నగర్ కాలనీ సమస్యను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి వెంటనే తీసుకెళ్లి, శైలో బంకర్ బాధితులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై అవసరమైన చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సాధించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి జులై 28మహా :** మారిన వాతావరణం పరిస్థితులకు అనుగుణంగా వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు.మంగళవారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో క్లస్టర్ రైతు వేదిక లో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల పై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగలిగే, మార్కెట్ లో మంచి డిమాండ్ మరియు లాభదాయకత ఉన్నప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు త్రాగునీరు, సాగునీరు ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైన అంశాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని పంటల సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, మార్కెట్ సమాచారంఅందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులు సంప్రదాయ పంటలపైనే ఆధారపడకుండా జొన్నలు, పెసలు, మినుములు, కంది ఆముదం వంటి పంటలపై దృష్టి సారించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా లాభదాయకమైన పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రైతు వేదిక లో ఏర్పాటు చేసిన విత్తన మేళాలను రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రమణారెడ్డి , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,తహసీల్దార్ ఆంజనేయులు,వ్యవసాయ అధికారులు , సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలి

- **అదనపు కలెక్టర్ భాస్కరరావు**

**ఆలేరు జూలై 28 మహా**: ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతుకు పంటకుంట, ప్రతి ఊరికి ఊటకుంట లక్ష్యంగా పనిచేయాలని అతను కలెక్టర్ అన్నారు మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు."ప్రతి ఇంటికి ఇంకుడు గుంత – ప్రతి రైతుకు పంటకుంట – ప్రతి ఊరికి ఊటకుంట" అనే లక్ష్యంతో మండలంలోని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, ప్రతి వ్యవసాయ పొలంలో పంటకుంటలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాల పెంపునకు బోర్‌వెల్ రీచార్జ్ పిట్స్, గ్రామాల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సర్పంచులను కోరారు.మహిళా సంఘాల సభ్యులు కూడా జలసిరి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, తమ ఇళ్లలో, వ్యవసాయ పొలాల్లో ఇంకుడు గుంతలు, పంటకుంటలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని తెలిపారు.అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణ-2026 నిబంధనలు, సూర్య ఘర్ యోజన ద్వారా అందుబాటులో ఉన్న సౌర విద్యుత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఘన వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడంతో పాటు, సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు, సర్పంచులకు సూచించారు.నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేసి జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ స్పెషల్ ఆఫీసర్, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణా రెడ్డి, ఎంపీడీవో సత్యంజనేయ ప్రసాద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మహిళా సంఘాల బుక్ కీపర్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భూముల సర్వే, రీ సర్వే ల తోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



బెల్లంపల్లి,మహా:భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం తాండూర్ మండలం ద్వారకాపూర్ గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల తహసిల్దార్ జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయ పరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తు భూ లావాదేవీలకు సంబంధించి మ్యాపులో మార్పులు తప్పనిసరిగా నవీకరించడం జరుగుతుందని, గ్రామంలో దాదాపు 90 శాతం భూములకు శాశ్వత పరిష్కారం జరిగిందని, మిగిలిన భూమి న్యాయస్థానంలో కొనసాగుతున్న వివాదాల తీర్పు అనంతరం పరిష్కారం అవుతుందని తెలిపారు. రీ సర్వే అనంతరం అసలైన అర్హుల పేరిట భూ రికార్డులు ఉంటాయని, నక్షా పకడ్బందీగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి అంజయ్య, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వ్యవసాయ అధికారి సుష్మ లతో కలిసి రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. రైతులు ప్రభుత్వ సూచనల ప్రకారం పంట సాగు చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసాడి తిరుపతి, ఆకుల వెంకటేష్, ఏ ఈ ఓ వెంకటేష్, మాజీ ఎంపిపి సిరంగి శంకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలతో ముందుకు సాగాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**
- **ఆరుతడి పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి**
- **భూగర్భ జలాల సంరక్షణకు జలసిరి కార్యక్రమాన్ని అమలు చేయాలి**



**జూలూరుపాడు, మహా:** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశాల సందర్భంగా రెండు రోజులపాటు జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జూలూరుపాడు మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, సాధించాల్సిన లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచులతో విస్తృతంగా చర్చించారు. జలసిరి కార్యక్రమం కింద ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ మరుగుదొడ్లు, ఫారం పాండ్లు, పర్‌కొలేషన్ ట్యాంకుల నిర్మాణం, అలాగే ఎల్‌నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో సుమారు 40 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు నమోదైందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సాధారణం కంటే అధిక వర్షాలు కురిసినప్పటికీ, ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. దాదాపు 25 సంవత్సరాల తర్వాత ఎల్‌నీనో ప్రభావం కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, గాలిలో వేడి శాతం పెరగడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ, నీటిపారుదల, పశుసంవర్ధక, విద్య తదితర శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులపాటు మండల స్థాయి సమావేశాల్లో విస్తృతంగా చర్చించి, రాబోయే సంవత్సరంలో ఎల్‌నీనో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు వెల్లడించారు. గత సీజన్‌లో వరితో పాటు మొక్కజొన్న సాగు కూడా అధికంగా జరిగిందని, సుమారు 42 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంతో పాటు 70 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులకు సుమారు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. అలాగే పత్తి, కూరగాయలు వంటి మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న పంటల సాగును ప్రోత్సహించాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. భూగర్భ జలాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, ప్రతి గ్రామంలో ఫారం పాండ్లు, పర్‌కొలేషన్ ట్యాంకులు, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించేలా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో నాగలక్ష్మి మాట్లాడుతూ, జూలూరుపాడు మండలానికి 99 ఫారం పాండ్ల నిర్మాణ లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 29 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం నాలుగు ఫారం పాండ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. గాంధీనగర్, గుండ్లరేవు, కాకర్ల, కొత్తూరు గ్రామాల్లో ఇప్పటివరకు ఫారం పాండ్లు గుర్తించలేదని, ఆయా గ్రామాలకు ప్రాధాన్యత ఇచ్చి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పర్‌కొలేషన్ ట్యాంకులు, ఫారం పాండ్లు ఏర్పాటు చేసేలా సర్పంచులు, అధికారులు రైతుల్లో అవగాహన కల్పించి సహకరించాలని ఆమె కోరారు. అనంతరం శాఖల వారీగా మండలంలో చేపడుతున్న కార్యక్రమాలను మండల స్థాయి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శైలజ, ఎంపీడీవో రవి, తాహసిల్దార్ శ్రీనివాస్, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## టీబీ నిర్మూలనకు ఎక్స్‌రే క్యాంప్..

- **42 మందికి పరీక్షలు..**
- **9 మంది నుంచి కఫ నమూనాల సేకరణ**

**మణుగూరు, మహా :** టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ బొమ్మ సెంటర్‌లో టీబీ ఎక్స్‌రే క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, మందుల వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. క్యాంపులో మొత్తం 42 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, టీబీ అనుమానితులుగా గుర్తించిన 9 మంది నుంచి కఫ (తేమడ) నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్, శివలింగాపురం గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా యాంటీ లార్వా కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిని, వైద్య సిబ్బంది రాంప్రసాద్, ప్రభావతి, లక్ష్మి, కృష్ణవేణి, రాధాతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు వృత్తి విద్య కోర్సులను
# సద్వినియోగం చేసుకోవాలి

- **జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: మహిళలు వృత్తి విధ్యా కోర్స్ లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జివి.కిరణ్ కుమార్ అన్నారు. సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో 3 నెలల పాటు బాబుక్యాంప్ పోస్ట్ ఆఫీస్ మహిళలకు ఉచిత టైలరింగ్ ఎంసి క్వార్టర్స్ సుజాతనగర్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్, ఎన్‌కే నగర్ మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని మంగళవారం జిఎం(పర్సనల్) వెల్ఫేర్ జివి. కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ముఖ్య ఉద్దేశం ఉద్యోగుల కుటుంబ మహిళలు, ప్రాజెక్టు ప్రభావిత పరిసర ప్రాంత మహిళలు ఆర్థికముగా ఎదిగి ఉపాధి పొందాలని సూచించారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులను నిర్వహిస్తున్నామని దీనిని సక్రమంగా ఉపయోగించుకొని క్రమం తప్పకుండా హాజరై కోర్సు పూర్తి చేసి మంచి శిక్షణ పొంది వృద్ధిలోకి రావాలని కోరారు. ఇందులో భాగంగా బాబుక్యాంప్, పోస్ట్ ఆఫీస్ మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంసి క్వార్టర్స్, సుజాతనగర్ మహిళలకు ఉచిత మగ్గం వర్క్స్, ఎన్‌కే నగర్ మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణా తరగతులను ప్రారంభించుకుంటున్నామని 3 నెలల పాటు నిర్వహించే ఈ ఉచిత వృత్తి శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఈ యొక్క వృత్తి విద్యా కోర్సులు శ్రద్ధగా నేర్చుకోవాలని కోరారు. ఈ వృత్తి శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు "ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ హైదరాబాద్" వారిచే సర్టిఫికెట్లు కూడా అందచేయబడునని ఈ వృత్తి శిక్షణా కోర్సులు నేర్చుకున్న మహిళలు తాము నేర్చుకున్న వృత్తి శిక్షణ ద్వారా యూనిట్లను నెలకొల్పుకొని తమతో పాటు మరికొందరికి జీవనోపాధి కల్పించాలని అదే విధముగా తాము తయారు చేసిన వాటిని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ నందు స్టాల్స్ ఏర్పాటుచేసుకొని విక్రయించేందుకు కూడా సింగరేణి సంస్థ సహాయం చేస్తుందని తెలిపారు. అనంతరం 202425 సంవత్సరంలో వృత్తి శిక్షణా కోర్సులు నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ కేశవ రావు, డివై.పిఎం కే.శివ కుమార్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, సేవా కొఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవాసెక్రెటరీ మాధవీ స్వర్ణలత, సేవా కోఆర్డినేటర్లు మునీలా, పుష్ప, రమాదేవి, అరుణ, పద్మావతి, దీప శిక్షకులు, ఇతర సేవా సభ్యులు అభ్యర్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాగమయి ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ల కీలక సమావేశం

**సత్తుపల్లి, జులై 28: మహా.**
స్థానిక లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్ లెవెల్ ఏజెంట్లతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ వాటర్ జాబితా నమోదు, సవరణలు పై నిర్వహిస్తున్న "సర్" కార్యక్రమం పై పార్టీ కార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి బూత్ లెవెల్ ఏజెంట్ (బి.ఎల్.ఏ) కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ విజయానికి ప్రతి అభ్యర్థి ఓటు కీలకమని, అవసరమైతే పార్టీలోని అభ్యర్థుల గృహాలను సందర్శించి ఓట్ ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించి ఆన్లైన్ లో ప్రవేశం పొందని ఓట్లను మరల ఆన్లైన్ చేసే విధంగా బి.ఎల్.ఓ లు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి దయాద రవీంద్ర, పార్లమెంట్ ఇన్చార్జి గోపిశెట్టి రాఘవేంద్రరావు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మున్సిపాలిటీల మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వ్యవసాయ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, 5 మండలాల పార్టీ మండల అధ్యక్షులు, గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## కస్టమర్లను దూషించిన క్యాటరింగ్ నిర్వాహకుడు అరెస్టు

**రాజేంద్రనగర్, మహా:** క్యాటరింగ్ సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కస్టమర్లను ఫోన్‌లో దూషించడం, సోషల్ మీడియాలో అవమానకర పోస్టులు చేయడం, కుల దూషణలకు పాల్పడిన ఓ క్యాటరింగ్ నిర్వాహకుడిని శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులు అరెస్టు చేశారు. ఆర్జీఐఏ ఏసీపీ శ్రీకాంత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముదిరాజ్ వన్‌పూర్ స్వామి (34) 2022 నుంచి జస్ట్ డయల్ ద్వారా క్యాటరింగ్ సిబ్బందిని సరఫరా చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసిన వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని దుర్భాషలాడడంతో పాటు సోషల్ మీడియాలో పరువు నష్టం కలిగించే పోస్టులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, నార్సింగి, కుషాయిగూడ, సైబర్ క్రైమ్, కూకట్‌పల్లి తదితర పోలీస్ స్టేషన్లలో అతనిపై 20కి పైగా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కేసును ఇన్‌స్పెక్టర్ సంజీవులు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.



## భగవంతుని ధ్యానంతోనే ఆత్మ సంతృప్తి

**చాలీసా పారాయణంలో రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా**

**కుషాయిగూడ, మహా :** భగవంతుని ధ్యానంలోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని, ఆత్మ సంతృప్తి మోక్షమార్గానికి మొదటి మెట్టు హనుమాన్ చాలీసా యే అని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం అందరికీ శ్రేయస్కరం... శుభకరమన్నారు. సదాచారి గురుస్వామి ఆధ్వర్యంలో మూడవ రోజు నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా కార్యక్రమానికి శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజులు ప్రతిరోజు 108 హనుమాన్ చాలీసా పారాయణాలు చేయాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం జవహర్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలందరికీ ఎంతో శ్రేయస్కరమన్నారు ఈ కార్యక్రమానికి వర్షం కారణంగా అంతరాయం కలిగినప్పటికీ హనుమాన్ చాలీసా పారాయణాన్ని సదాచారి గురుస్వామి వారి బృందం నిరాశ నిస్పృహలకు గురి కాకుండా ఉత్సాహంగా కొనసాగించడం ఎంతో గర్వించదగ్గ విషయమని కొనియాడారు ఈ కార్యక్రమంలో రమేష్ చారి, విజయ్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## వీధి లైట్ల సమస్యపై డిప్యూటీ కమిషనర్ స్పందన

**కుషాయిగూడ మహా :** కుషాయిగూడలో విద్యుత్ హెచ్చు తగ్గుల కారణంగా సుమారు 40కి పైగా వీధి లైట్లు దెబ్బతినడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కాప్రా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ పోతుల రవీందర్ సాగర్‌కు వినతిపత్రం అందజేసింది. దీనిపై ఆయన వెంటనే స్పందించి, మున్సిపల్ ఎలక్ట్రికల్ డీఈ అనితకు దెబ్బతిన్న వీధి లైట్లను పరిశీలించి అవసరమైన చోట కొత్త ఎల్ ఈడీ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమస్యపై సత్వర స్పందన చూపిన డిప్యూటీ కమిషనర్, ఎలక్ట్రికల్ డీఈలకు వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, సలహాదారుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పండాల గణేష్ గౌడ్, కార్యదర్శి శీలం అనిల్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మల్ రెడ్డిని కలిసిన టీజీఎస్పీ 3వ బెటాలియన్ అధికారులు....

- ఆగస్టు 3న ప్రారంభోత్సవాలకు మల్ రెడ్డి రంగారెడ్డికి ఆహ్వానం....
- అప్రోచ్ రోడ్డుతో పాటు స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవాలకు ఆహ్వానం....
- బెటాలియన్ సిబ్బంది హెచ్ఆర్ఏ ఫైల్ విషయంపై కలెక్టర్ తో మాట్లాడిన ఎమ్మెల్యే



**ఇబ్రహీంపట్నం జూలై 28 మహా:** తెలంగాణ స్పెషల్ పోలీస్ మూడో బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిని కలిశారు. బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష, అసిస్టెంట్ కమాండెంట్లు ఎం.వీరయ్య, ఆర్.పాండులు వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాల కోసం ఆగస్టు 3న బెటాలియన్ కు రావాలని వారు ఆహ్వానించారు. నాగన్ పల్లి రోడ్డు నుంచి బెటాలియన్ గేటు వరకు హెచ్ఎండీఏ నిధులతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు పూర్తికాగా ఈ మేరకు వారు తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి తమ సంతోషం వ్యక్తం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగానే 3వ తేదీన అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే, అదే రోజు నుంచి ఇంటర్నల్ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్ జరగనున్నందున ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**హెచ్ఆర్ఏ అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి...**

ఈ సందర్భంగా హెచ్ఆర్ఏ ఫైల్ అంశాన్ని వారు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గత డిసెంబర్ లో గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తరణ నేపథ్యంలో పెరిఫరీ 8 కిలోమీటర్లలోపు తమ బెటాలియన్ ఉన్నందున... కలెక్టర్ గారి వద్ద ఉన్న ఇంటి అద్దె పెంపు ఫైల్ ను త్వరగా నోటిపై చేయించాల్సిందిగా కోరారు. వెంటనే స్పందించిన మల్ రెడ్డి... ఫోన్లో కలెక్టర్ తో చర్చించారు. ఎమ్మెల్యే చొరవ పట్ల బెటాలియన్ అధికారులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. మల్ రెడ్డిని కలిసిన వారిలో రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు రవీందర్, యుగేందర్, శేఖర్, యూనిట్ వైద్యాధికారి రవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

# తక్కువ కాలపరిమితి నీటి వినియోగం ఉన్న పంటలు వేసుకోవాలి

- రైతులు ఎల్ నినో కారణంగా అప్రమత్తంగా ఉండాలి
- ఉప్పరిగూడ గ్రామ సర్పంచ్ శ్రీవేణి
- మండల వ్యవసాయ అధికారి విద్యాదరి,



**ఇబ్రహీంపట్నం జిల్లా 28 మహా:** రైతులు ఎల్ నినో కారణంగా అప్రమత్తంగా ఉండాలని తక్కువ కాల పరిమితి తక్కువ నీటి వినియోగం ఉన్న పంటలు వేసుకోవాలి గ్రామ సర్పంచ్, మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం, ఉప్పరిగూడ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళ, రైతు నేస్తంలో పాల్గొన్న ఉప్పరిగూడ గ్రామ సర్పంచ్ శ్రీవేణి, మండలం వ్యవసాయ అధికారి విద్యాదరి, రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ... రైతులకు ఎల్ నినో ప్రభావాన్ని ఎదురుకొనే చర్యలలో భాగంగా, తక్కువ కాలపరిమితి, తక్కువ నీటి వినియోగం ఉన్న పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. ఎక్కువ నీటి వినియోగం ఉన్న పంటలకు బదులుగా తక్కువ నీటి వినియోగంతో వచ్చే మంటలు పెసర, ఉలవ, స్వల్ప కాలిక కంది, నువ్వులు, పశుగ్రాస పంటలు పండించాలని వారు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా జలసిరిలో భాగంగా అవకాశం కల్పిస్తున్న పంట కుంట/ ఫారం పాండ్, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న, కప్పాపహాడ్ గ్రామ రైతు జడల యాదగిరి రెడ్డిని సన్మానించడం జరిగిందన్నారు. వారు వరికి బదులు ఆయిల్ పామ్, కూరగాయల సాగు, సేంద్రీయ, డ్రిప్పు పద్దతులు పాటిస్తూ మండల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3లోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి

**తహసిల్దార్ గౌతమ్ కుమార్**

**మొయినాబాద్ మహా:** ఓటు ప్రజాస్వామ్యానికి పునాది ఓటుతో ప్రజా స్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవకాశం ఉందని. అందుకే ప్రతి ఒక్కరు తమ పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకోవాలని మొయినాబాద్ తహసిల్దార్ గౌతం కుమార్ పిలుపునిచ్చారు. ఓటు హక్కు మన రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కుగా ఆయన అభివర్ణించారు. ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును బాధ్యతగా కాపాడుకోవాలని తెలిపారు. ఓటర్ల నమోదు వివరాల సవరణకు సంబంధించి ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ఎన్యూమరేషన్ ఫారంలు ఆగస్టు 3వ తేదీలోగా సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ బి ఎల్ ఓ కు తప్పనిసరిగా అందజేయాలని ఆయన సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ఓటర్ జాబితాలో పేరు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు.

# చేవెళ్ల టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జిగా బేగరి రాజు నియామకం



**మొయినాబాద్ మహా:** తెలంగాణ రక్షణ సేన చేవెళ్ల నియోజకవర్గం నాయకులు బేగరి రాజును మంగళవారం నాడు తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా బేగరి రాజు ను ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కు ధన్యవాదాలు తెలిపారు ఈ సందర్భంగా నూతన తెలంగాణ రక్షణ సేన పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం లో ఎస్సీ జనాభా అత్యధిక ఓటర్లు కలిగిన ప్రాంతమని మూడు దశాబ్దాలు గడుస్తున్నా ఎన్ని పార్టీలు మారిన దళితులకు చేసింది ఏమీ లేదని వారు ఎద్దేవ చేశారు కవితమ్మ గారి నాయకత్వంలో పంచజన్య విద్య, ఉపాధి, వైద్యం,వ్యవసాయం, సామాజిక న్యాయం ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ పని చేస్తుందని అన్నారు. ఈ పార్టీలో అన్ని వర్గాల ప్రజలకు నాయకత్వం ఉంటుందని ఇతర పార్టీల నుండి టిఆర్ఎస్ పార్టీలో అత్యధిక శాతంలో చేరుతున్నారని గుర్తు చేశారు . పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేస్తానని అన్నారు నా పైన నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను ఈ అవకాశం కల్పించిన టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివశంకర్, మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు యండి అన్వార్ ఖాన్, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షులు మేకగూడెం బిక్షపతి, షేక్ నూర్ భాయ్,సంగరి నగేష్, ఏనుగు సంజీవ రెడ్డి,బొక్క సురేందర్ రెడ్డి, కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, సంతోష్‌కుమార్, బొక్క రవీందర్ రెడ్డి, మాలని రాజు, యండి యూనిస్, చాకలి విక్రమ్, చాకలి వినోద్ కుమార్,కుమ్మరి పవన్,మల్లేష్, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు



# జైలు అభివృద్ధి పనులపై జైళ్ల శాఖ డీజీ సమీక్ష

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి జైల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఖైదీల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా మంగళవారం పరిశీలించారు. చర్లపల్లి చెరువు పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఆమె, వాకింగ్ ట్రాక్ వెంబడి చీకటి ప్రాంతాల్లో సందర్శకుల భద్రత కోసం సౌర విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రిజనర్స్ అగ్రికల్చరల్ కాలనీలో అభివృద్ధి చేస్తున్న స్వామి వివేకానంద వనం, ప్రతిపాదిత బహుళ ప్రయోజనాల సమావేశ మందిరం నిర్మాణ స్థలాన్ని పరిశీలించి పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సెంట్రల్ జైలు పరిశ్రమలు, ఉత్పత్తి విభాగాలను సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా విడుదల అనంతరం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సెంట్రల్ జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ ఐటీఐ పనులను సమీక్షించిన డీజీ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక శిక్షణ అందించి జాతీయ స్థాయి సర్టిఫికెట్లు కల్పించడం లక్ష్యమని తెలిపారు. సమీక్షలో కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందన దాసరి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

**కాంగ్రెస్ నాయకులకు స్థానికుల కృతజ్ఞతలు**

కుషాయిగూడ, మహా : గాంధీనగర్‌లో రూ.20 లక్షల నిధులతో కమ్యూనిటీ హాల్ ఎదురుగా, రీడింగ్ రూమ్ వద్ద సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని వారు పేర్కొన్నారు. గాంధీనగర్‌లో రూ. 50 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మాణంతో పాటు రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం అభినందనీయమని తెలిపారు.

## కాలుష్య నీటితో పంటల కు దెబ్బ

**చర్యలు తీసుకోవాలని రైతుల ఆందోళన**

కుషాయిగూడ, మహా : కీసర మండలం: అంకిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 812 వద్ద ఉన్న ఈ పవర్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీటి కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్య నీరు వ్యవసాయ భూముల్లోకి చేరడంతో పంటలు నాశనమవుతున్నాయని, దీనివల్ల తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదురవుతున్నాయని తెలిపారు. కాలుష్య ప్రభావంతో భూమి సారవంతత కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనాస్థలాన్ని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, కాలుష్య నీటి నమూనాలను పరీక్షించాలని రైతులు కోరారు. పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతులకు తగిన పరిహారం అందించడంతో పాటు, భవిష్యత్తులో కాలుష్య నీరు పొలాల్లోకి చేరకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ సమస్యపై రైతులు ఆందోళన చేపట్టారు.



## ఇళ్ల స్థలాల బాధితులకు న్యాయం చేస్తాం..

**మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ రెవెన్యూలోని సర్వేనెంబర్ 151లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పేదలకు పంపిణీ చేసిన 60 గజాల బాధితులకు ఇళ్ల స్థలాలు చూపించి న్యాయం చేస్తామని, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో కలిసి హిమాయత్ నగర్ 60 గజాల బాధితులు మంత్రి దుద్దిల శ్రీధర్ బాబును ఆయన నివాసంలో కలిసి తమకు 60 గజాల ఇళ్ల స్థలాలను చూపించి న్యాయం చేయాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాల సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు.. హిమాయత్ నగర్ 60 గజాల బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తానని, ఇళ్ల స్థలాల విషయంలో ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు. త్వరలో బాధితులకు ఇళ్ల స్థలాలను చూపించి. బాధితులు ఇళ్లు నిర్మించుకునేందుకు కృషి చేస్తానని మంత్రి శ్రీధర్ బాబు బాధితులకు హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాల విషయంలో జిల్లా కలెక్టర్ ను కలవాలని సూచించారు. ఇళ్ల స్థలాల బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని అన్నారు. మంత్రికి వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నరసింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, ముదిగొండ శ్రీహరియాదవ్, మాజీ సర్పంచ్ ముదిగొండ మంజుల రవియాదవ్, నరోత్తంరెడ్డి, సుధాకర్ యాదవ్, మాల యాదయ్య, సలీంఖాన్, హిమాయత్ నగర్ యువజన సంఘాల అధ్యక్షులు కొర్ర గోపాల్ నాయక్, కుమ్మరి విఠల్, కట్టమీది శ్రీను,మహమ్మద్ కరీం,జెల్లెల మల్లేష్ యాదవ్, కాళిదాస్ చారి, హిమాయత్ నగర్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదకరంగా... జవహర్ నగర్ యాప్రాల్ ప్రధాన రహదారి

**వెంటనే మరమ్మతులు చేపట్టండి వాహనదారుల విన్నపం.**

**కుషాయిగూడ, మహా :** యాప్రాల్ నుండి జవహర్ నగర్ కు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహన దారులతోపాటు పెద్ద వాహన దారులు తరచూ ప్రమాదానికి లోనవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ కు వెళ్లే ముఖ్యమైన రహదారి కావడంతో నిత్యం ఈ రహదారి వెంబడి రద్దీ ఉంటుందని, అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతిరోజు వేలాదిమంది ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని వాహనదారులు, జవహర్ నగర్ యాప్రాల్ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు త్వరగా సమర్పించాలి

**రాజేంద్రనగర్, మహా:** ఓటరు జాబితా సవరణలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు ఇంకా సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే వాటిని నింపి బీఎల్‌వోలకు అందజేయాలని రాజేంద్రనగర్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ బొమ్మ రాములు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 86 పోలింగ్ కేంద్రాల్లో 1,07,441 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 53,264 మంది వివరాలు డిజిటైజ్ అయ్యాయని, మిగిలిన ఓటర్లు త్వరగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశంపైనా చర్చించారు.



# ప్రజా వైద్యాన్ని బలోపేతం చేసి కార్పొరేట్ వైద్యాన్ని అరికట్టాలి

**సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం**

కుషాయిగూడ, మహా : ప్రజా వైద్య వ్యవస్థను బలోపేతం చేసి, కార్పొరేట్ వైద్య రంగం ఆధిపత్యాన్ని అరికట్టాలని సీపీఐఎం నాయకులు డిమాండ్ చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 2న డాక్టర్ ఏఎస్‌రావు నగర్ సీనియర్ సిటిజన్స్ భవనంలో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న ప్రజా వైద్య సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కమలానగర్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి. సత్యం మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి మనిషికి అమూల్యమైనదని, ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వాలు వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించే విధానాలు అమలు చేస్తున్నాయని విమర్శించారు. దీంతో సాధారణ జ్వరానికే వేల రూపాయలు, శస్త్రచికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని, వైద్య వ్యయాలను భరించలేక అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని, మరి కొందరు చికిత్స పొందలేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కేరళ రాష్ట్రం ప్రజా వైద్య రంగంలో ఆదర్శంగా నిలిచిందని, తెలంగాణలో కూడా అలాంటి వైద్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు జిల్లాలు, మండలాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 2న జరిగే ప్రజా వైద్య సదస్సుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జె. చంద్రశేఖర్, జి. శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు ఎన్. శ్రీనివాస్, సీనియర్ నాయకులు జి. యాదగిరిరావు, శ్రీమన్నారాయణ, ఎం. శ్రీనివాసరావు, మల్లేష్, శోభ గౌస్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం



**రాజేంద్రనగర్, మహా:** వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని శంషాబాద్ మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం పాలమాకుల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ, వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, చెరువులోకి డ్రైనేజీ నీరు చేరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఆలియా సినిమా ప్రభావమా?.. 'ధూమ్ 4'పై రణ్‌బీర్ రూమర్లు

బాలీవుడ్‌లో ప్రస్తుతం 'ధూమ్ 4' చిత్రం చుట్టూ ఆసక్తికర ప్రచారం సాగుతోంది. స్టార్ హీరోయిన్ ఆలియా భట్ నటించిన తాజా యాక్షన్ చిత్రం 'ఆల్ఫా' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, దాని ప్రభావం యశ్‌రాజ్ ఫిల్మ్స్ (వైఆర్ఎఫ్) ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులపై పడిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ధూమ్ 4' నుంచి హీరో రణ్‌బీర్ కపూర్ తప్పుకున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జోరందుకుంది.

**'ఆల్ఫా' ఫలితంపై చర్చ**

వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన 'ఆల్ఫా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే విడుదల తర్వాత ఆశించిన స్పందన రాకపోవడంతో ఈ సినిమా నిరాశపరిచిందనే ప్రచారం జరుగుతోంది. దీంతో సంస్థ భవిష్యత్ ప్రాజెక్టులపై మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**'ధూమ్ 4'పై ఊహాగానాలు**

'ధూమ్' సిరీస్‌లో గతంలో హృతిక్ రోషన్, ఆమిర్ ఖాన్ వంటి స్టార్ హీరోలు నటించారు. తాజా భాగమైన 'ధూమ్ 4'లో రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తారని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే కథ, స్పై యూనివర్స్‌తో అనుసంధానం వంటి అంశాలపై రణ్‌బీర్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే ప్రాజెక్ట్‌పై పునరాలోచన చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

**అధికారిక ప్రకటన లేదు**

అయితే ఈ ప్రచారంపై ఇప్పటివరకు రణ్‌బీర్ కపూర్ గానీ, యశ్‌రాజ్ ఫిల్మ్స్ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని, రణ్‌బీర్ సినిమా నుంచి తప్పుకున్నారనే వార్తలకు ఇప్పటివరకు అధికారిక ధృవీకరణ లేదని తెలుస్తోంది. దీంతో 'ధూమ్ 4'పై వస్తున్న వార్తలు ప్రస్తుతం ఊహాగానాలకే పరిమితమయ్యాయి.

## సముద్ర తీరంలో రిచా అందాల సందడి

దక్షిణాది సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి రిచా పనాయ్ మరోసారి తన గ్లామరస్ లుక్‌తో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్నారు. థాయ్‌లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పుకెట్‌లో విహారయాత్రను ఆస్వాదిస్తున్న ఆమె, ఎరుపు రంగు సీషెల్ ప్రింట్ బికినీతో పాటు మ్యాచింగ్ సారాంగ్ ధరించి దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. సన్‌గ్లాసెస్, హెడ్‌బ్యాండ్, పెర్ల్ ఆభరణాలతో స్టైలిష్‌గా కనిపించిన ఆమె, సముద్ర తీరంలోని ప్రకృతి అందాల నడుమ దిగిన చిత్రాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన రిచా పనాయ్, పలు ప్రముఖ ప్రకటనల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం మలయాళ చిత్ర పరిశ్రమలో నటిగా అడుగుపెట్టి, 2011లో విడుదలైన వాదమల్లి, బ్యాంకాక్ సమ్మర్, శాండ్‌విచ్ చిత్రాలతో మంచి గుర్తింపు పొందారు. వాదమల్లి చిత్రానికి గాను ఉత్తమ నూతన నటిగా ఆసియానెట్ ఫిల్మ్ అవార్డును కూడా అందుకున్నారు. 2012లో యముడికి మొగుడు సినిమాతో తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించిన రిచా, చంద్రమామ కథలు, లవకుశ, ట్రాఫిక్, ఈడు గోల్డ్ ఎహే తదితర చిత్రాల్లో నటించి ప్రేక్షకులకు చేరువయ్యారు. గ్లామర్‌తో పాటు నటనకూ ప్రాధాన్యం ఇస్తూ దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇటీవలి కాలంలో సినిమాల్లో తక్కువగా కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అభిమానులతో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. పర్యటనలు, జీవనశైలి, ఫొటోషూట్లకు సంబంధించిన చిత్రాలను తరచూ పంచుకుంటూ అభిమానులను అలరిస్తున్నారు. పుకెట్ విహారయాత్రలో దిగిన తాజా ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.





## బ్రహ్మముహూర్తంలో 'రామాయణ' ట్రైలర్ విడుదల

భారతీయ ఇతిహాసం ఆధారంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'రామాయణ'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నితీష్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తుండగా, యశ్, సన్నీ డియోల్, రవి దూబే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ట్రైలర్ విడుదలకు సంబంధించిన ఆసక్తికర ప్రకటన చేసింది. సాధారణంగా ట్రైలర్లను సాయంత్రం లేదా రాత్రి వేళల్లో విడుదల చేసే ఆనవాయితీకి భిన్నంగా, ఈ చిత్ర ట్రైలర్‌ను పవిత్రమైన బ్రహ్మముహూర్తంలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. జూలై 30 గురువారం తెల్లవారుజామున భారత కాలమానం ప్రకారం ఉదయం 4.15 గంటలకు ప్రపంచవ్యాప్తంగా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రత్యేక సమయ ఎంపికతో 'రామాయణ'పై మరింత ఆసక్తి నెలకొనగా, ట్రైలర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అన్న జ్ఞాపకాలతో భావోద్వేగానికి గురైన కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ వేడుకలో హీరో అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలో మాట్లాడిన కిరణ్ అబ్బవరం తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ విషాద ఘటనను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ముందుగా నాగచైతన్యకు కృతజ్ఞతలు తెలిపిన కిరణ్, తన ప్రతి ప్రయాణంలో ఆయన మద్దతు ఎంతో విలువైనదని అన్నారు. తమ సినిమా విజయోత్సవానికి ముఖ్య అతిథిగా రావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సినిమా గురించి మాట్లాడుతూ దర్శకుడు రవి నంబూరి తొలిసారి ఇంటర్వెల్ సన్నివేశాన్ని వివరించినప్పుడు తన సొంత అన్నయ్య గుర్తుకొచ్చారని కిరణ్ తెలిపారు. చిన్నతనంలో స్నాక్స్ తీసుకురావడానికి వెళ్లిన తన అన్నయ్య ప్రమాదంలో మరణించారని, ఆ సన్నివేశం విన్న క్షణంలో ఆ జ్ఞాపకాలు కళ్లముందు మెదిలాయని చెప్పారు. కథ తన జీవితాన్నే ప్రతిబింబిస్తున్నట్లు అనిపించి తీవ్ర భావోద్వేగానికి గురయ్యానని వెల్లడించారు. ఈ విషయాన్ని సినిమా షూటింగ్ సమయంలో గానీ, కథా చర్చల్లో గానీ చిత్రబృందంలోని ఎవరికీ చెప్పలేదని, విజయోత్సవ వేదికపైనే తొలిసారి అందరితో పంచుకుంటున్నానని కిరణ్ తెలిపారు. "రవి అన్న కథ చెబుతున్నప్పుడు ఇంటర్వెల్ సీన్ మొత్తం మా అన్నయ్య జీవితంలో జరిగిన సంఘటననే చెబుతున్నట్టుగా అనిపించింది. ఈ కథ నా దగ్గరకు ఎలా వచ్చింది అని అప్పుడే ఆశ్చర్యపోయాను" అని చెప్పడంతో సభలో ఉన్న వారంతా భావోద్వేగానికి లోనయ్యారు. కిరణ్ అబ్బవరం చెప్పిన ఈ నిజజీవిత అనుభవం అభిమానులను కదిలించింది. సినిమాలో ఆయన ప్రదర్శించిన భావోద్వేగానికి వెనుక ఉన్న నిజమైన జీవిత గాయం ఇదేనంటూ అభిమానులు సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఆయన నటనను ప్రశంసిస్తున్నారు.





## కీర్తి సురేష్ స్పెషల్ సాంగ్?..

ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో స్పెషల్ సాంగ్స్ అంటే ప్రత్యేక గుర్తింపు ఉన్న హీరోయిన్లకే పరిమితమయ్యేవి. కానీ కాలక్రమేణా పరిస్థితులు మారాయి. కథకు ప్రాధాన్యం ఉండి, సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందనుకుంటే స్టార్ హీరోయిన్లు కూడా స్పెషల్ సాంగ్స్ చేయడానికి ముందుకొస్తున్నారు. కమర్షియల్ సినిమాల్లో ఈ పాటలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే ప్రధాన ఆకర్షణగా మారడంతో దర్శక నిర్మాతలు కూడా వాటిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఈ ట్రెండ్‌కు సమంత, శ్రీలీల, తమన్నా వంటి హీరోయిన్లు మరింత ఊతమిచ్చారు. 'పుష్ప'లో సమంత చేసిన 'ఊ అంటావా' పాట దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించగా, 'పుష్ప 2'లో శ్రీలీల చేసిన 'కిస్సిక్' సాంగ్ కూడా విపరీతమైన ఆదరణ పొందింది. తమన్నా కూడా పలు కమర్షియల్ చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా తన డ్యాన్స్ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. ఇప్పుడు ఇదే జాబితాలో జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ పేరు కూడా వినిపిస్తోంది. ఇప్పటివరకు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలనే ఎక్కువగా ఎంపిక చేసుకుంటూ వచ్చిన కీర్తి, ఇటీవల కమర్షియల్ చిత్రాలపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' చిత్రంలో ఆమె స్పెషల్ సాంగ్ చేయనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల ప్రమోషన్‌లో స్పెషల్ సాంగ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక మంచి డ్యాన్స్ నంబర్ లేదా సోషల్ మీడియాలో వైరల్ అయ్యే పాట సినిమా విడుదలకు ముందే భారీ ప్రచారాన్ని తీసుకురాగలుగుతోంది. అందుకే దర్శక నిర్మాతలు కూడా వీటిని కేవలం వినోదం కోసం కాకుండా ప్రచార వ్యూహంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. స్టార్ హీరోయిన్లు అలాంటి పాటల్లో కనిపిస్తే వాటికి మరింత క్రేజ్ ఏర్పడుతోంది. అయితే స్పెషల్ సాంగ్స్ చేయడం ప్రతి సందర్భంలోనూ సానుకూల ఫలితాలనే ఇస్తుందనడం కష్టం. కథలో సహజంగా భాగమైతే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించే అవకాశం ఉంటుంది. అదే కేవలం కమర్షియల్ హంగుల కోసం చేర్చినట్లు అనిపిస్తే విమర్శలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంది.

కీర్తి సురేష్ నిజంగానే 'ది ప్యారడైజ్'లో స్పెషల్ సాంగ్ చేస్తారా? చేస్తే అది ఆమె కెరీర్‌లో మరో కొత్త కోణాన్ని పరిచయం చేస్తుందా? అనే అంశాలపై ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com